మన సమగ్ర
ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

రాజన్న సిరిసిల్ల | మంగళవారం 17 నవంబర్ 2026 | సంపుటి : 01 | సంచిక : 318 | పేజీలు : 12 | వెల : 2/-
RAJANNA SIRICILLA | TUESDAY, 17 NOVAMBER 2026 | Volume : 01 | Issue : 318 | Pages : 12 | Cost : 2/-

Wanted Reporters
తెలుగు రాష్ట్రాలలో దిగ్విజయంగా నడుపబడుతున్న
ప్రజావాణి దిన పత్రిక మరియు ప్రజావాణి NEWS TV చానల్
నందు పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా
విలేఖరులు కావలెను
(కొత్తవారికి అవకాశం, అనుభవం కల వారికి ప్రాధాన్యత)
Ph: 9440032006

ఏపీలో రెండో విడత పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- నవంబర్ 29న పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు
- ఈ నెల 18 నుంచి 20 వరకు నామినేషన్ల స్వీకరణ
- రెండో దశలో 4,960 సర్పంచ్, 49,224 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు
- మొత్తం మూడు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల నిర్వహణ



అమరావతి

ఏపీలో గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడతకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఈరోజు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం నవంబర్ 29న పోలింగ్ జరగనుంది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. నవంబర్ 21న ఉదయం 8 గంటల నుంచి నామినేషన్ల - మిగతా3లో



వైసీపీ నేతల అవినీతిపై వెబ్ సిరీస్ తీస్తే అంతం ఉండదు

- అంతులేని కథలా సాగుతూనే ఉంటుంది: కొల్లు రవీంద్ర
- వైసీపీ నాయకత్వంపై కొల్లు రవీంద్ర ఫైర్
- పీఏలే వేల కోట్లు దోస్తే యజమాని జగన్ ఇంకెన్ని లక్షల కోట్లు తిన్నారని ప్రశ్న
- దోచుకున్న ప్రజాధనాన్ని విదేశీ వ్యాపారాల్లో పెట్టుబడులుగా మళ్లించారని ఆరోపణ
- సాధారణ ఉద్యోగుల కుటుంబాల పేరిట వందల కోట్ల ఆస్తులు వెలుగులోకి
- నాసిరకం మద్యంతో వేలాది మంది మహిళలను వితంతువులుగా మార్చారని ఆగ్రహం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఈ నెల 20న కోస్తాంధ్రకు తీవ్ర తుపాను ముప్పు
- అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం..
- ముందస్తు చర్యలు చేపట్టాలని చంద్రబాబు ఆదేశాలు
- ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల తరలింపునకు సూచన
- విద్యుత్, వరద నిర్వహణపై ప్రత్యేక దృష్టి



అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి తుపాను ముప్పు పొంచి ఉంది. ఈ నెల 20వ తేదీన కోస్తాంధ్ర తీరాన్ని తీవ్ర తుపాను తాకే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అమరావతిలోని సచివాలయంలో ఉన్న రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కేంద్రం నుంచి చంద్రబాబు తుపాను పరిస్థితులపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం సోమవారం సాయంత్రానికి తుపానుగా, నవంబర్ 17 నాటికి తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉందని అధికారులు వివరించారు. అనంతరం మరింత బలపడి ఈ నెల 19--20 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ తీరానికి చేరుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. భారత వాతావరణ శాఖ తాజా అంచనాల - మిగతా3లో



ఐసీసీ చైర్మన్‌గా జై షా.. రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక

బాలి సమావేశాల్లో ఈ నిర్ణయం తీసుకున్న బోర్డు

2024 డిసెంబర్ 1న తొలిసారి బాధ్యతలు

35 ఏళ్ల వయసులో ఈ పదవిని అందుకున్న అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు

ఐసీసీ బోర్డు సభ్యులకు జై షా కృతజ్ఞతలు

ఒలింపిక్స్‌లో క్రికెట్, మహిళల క్రికెట్ అభివృద్ధిపై ప్రాధాన్యమని అని వెల్లడి

హైదరాబాద్ భారత్ సమ్మిట్ వివాదం
ఇటలీ నేతపై చర్యలకు తెలంగాణ బీజేపీ డిమాండ్

- భారత్ సమ్మిట్ వేదికగా విదేశీ నేత చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం
- హైదరాబాద్‌లోని ఎఫ్ఆర్ఆర్ఓకు ఫిర్యాదు చేసిన బీజేపీ బృందం
- ఇటలీ ప్రతినిధి దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నారని ఆరోపణ
- వీసా నిబంధనల ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్
- సమ్మిట్ నిర్వాహకులు నిధులపై సమగ్ర విచారణ జరపాలని విజ్ఞప్తి

హైదరాబాద్

హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన 'భారత్ సమ్మిట్' వేదికగా విదేశీ రాజకీయ ప్రతినిధులు చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ సదస్సులో భారత వ్యతిరేక, రెచ్చగొట్టే రాజకీయ వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు నేతృత్వంలోని పార్టీ ప్రతినిధి బృందం సోమవారం ఫారెనర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) అధికారులకు అధికారికంగా ఫిర్యాదు - మిగతా3లో


కిలో సన్నబియ్యం రూ.100!

- ధరలు ఫిక్స్ చేసినా తగ్గని రేట్లు.. సామాన్యుడికి అందని సర్కారు నియంత్రణ
- ఎల్‌నినో పేరుతో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు
- మిల్లర్లు, వ్యాపారుల మధ్య ధరల వ్యత్యాసం.. నాణ్యతపై వినియోగదారుల ఆందోళన



హైదరాబాద్

సామాన్యుడి వంటింట్లో బియ్యం ధరలు మంట పుట్టిస్తున్నాయి. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్న తరుణంలో సన్నబియ్యం ధరలు కూడా చుక్కలనంటుతున్నాయి. కిలో సన్నబియ్యం రూ.85 నుంచి రూ.100 వరకు పలుకుతుండటంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతోంది. ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి వివిధ రకాల బియ్యానికి గరిష్ఠ చిల్లర ధరలను (ఎంఆర్‌పీ) నిర్ణయించినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఆశించిన ఫలితాలు కనిపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దేశానికి రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన తెలంగాణలో బియ్యం ధరల పెరుగుదల చర్చనీయాంశంగా మారింది. గత ఏడాది 92.17 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, ఈసారి ఎల్‌నినో - మిగతా3లో



తెలంగాణ పదో తరగతి విద్యార్థులకు ఊరట..

- పరీక్ష ఫీజు గడువు పొడిగింపు
- ఆలస్య రుసుము లేకుండా నవంబర్ 26 వరకు అవకాశం
- జనవరి 4 వరకు ఆలస్య రుసుముతో చెల్లింపులకు ఛాన్స్
- ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులకు ఫీజు మినహాయింపు
- ఆన్‌లైన్‌లో మాత్రమే ఫీజు చెల్లించాలని స్పష్టీకరణ


మొయినాబాద్ టౌన్ ప్లానింగ్ అధికారిణిపై ఏసీబీ దాడులు.. అక్రమాస్తుల గుర్తింపు

ఆదాయానికి మించిన ఆస్తుల కేసు.. 10 చోట్ల ఏకకాలంలో సోదాలు

లంచం కేసు తర్వాత మరో చిక్కు.. అధికారిణి ఆస్తులపై ఏసీబీ నజర్

గుండు వాణి ఇళ్లు, బంధువుల నివాసాల్లో ఏసీబీ తనిఖీలు

రూ.75 వేల లంచం కేసు.. ఇప్పుడు ఆస్తుల లెక్కలు తీస్తున్న ఏసీబీ



ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
మంగళవారం 17
నవంబర్ 2026

వైసీపీ నేతల అవినీతిపై వెబ్ సిరీస్ తీస్తే అంతం ఉండదు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలు, దోపిడీలపై వెబ్ సిరీస్ తీస్తే దానికి అంతం ఉండదని, అది ఒక అంతులేని కథలా సాగుతుందని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నాటి పాలనలో జరిగిన అక్రమాలే ఆ పార్టీకి రాజకీయంగా సమాధి కట్టబోతున్నాయని ఆయన స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి జగన్ తో పాటు ఆయన చుట్టూ ఉన్న వారి అవినీతి బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. నాడు తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకుని సూట్‌కేస్ కంపెనీల ద్వారా వ్యవస్థలను ప్రభావితం చేసినట్లే, గత ఐదేళ్లలో తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా జగన్ భారీ అవినీతి సామ్రాజ్యాన్ని నడిపించారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. గతంలో పలువురు ఐఏఎస్ అధికారులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలను అవినీతి ఊబిలోకి దింపిన చరిత్ర ఆయనదని విమర్శించారు. మాజీ సీఎం కార్యాలయంలో నెలకు కేవలం రూ. 2 లక్షల జీతం తీసుకునే ఉద్యోగుల భార్యలు, కుటుంబ సభ్యులు, అనుయాయుల పేర్ల మీద వందల కోట్ల రూపాయల ఆస్తులు, కంపెనీలు ఎలా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. ఒక



సాధారణ టిఫిన్ బండి నడుపుకునే వ్యక్తికి వందల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయో ప్రజలు గమనించాలని సూచించారు. కింది స్థాయి పీఏలే వేల కోట్లు దోచుకుంటే, వీటన్నింటికీ యజమానిగా ఉన్న జగన్ ఇంకెన్ని లక్షల కోట్లు దోచుకున్నారో సమాజం ఆలోచించాలన్నారు.

గత ఐదేళ్లలో మద్యం కుంభకోణం, ఇసుక, మైనింగ్, పేదల భూముల ఆక్రమణల ద్వారా దోచుకున్న సొమ్మును విదేశాల్లోని వ్యాపారాల్లో పెట్టుబడులుగా పెట్టారని మంత్రి వివరించారు. రాష్ట్రంలో కొల్లగొట్టిన ప్రజాధనాన్ని దక్షిణాఫ్రికాలోని మద్యం, మైనింగ్ వ్యాపారాల్లోకి మళ్లించారని, అలాగే ఫిలిప్పీన్స్, థాయిలాండ్, మలేషియా వంటి దేశాలకు తరలించారని ఆరోపించారు. ఆ నిధులను తిరిగి దేశంలోకి తెచ్చుకోవడానికి దొంగ సాఫ్ట్‌వేర్ కంపెనీలు, సూట్‌కేస్ కంపెనీలను సృష్టించారని, కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి నిధులు తెచ్చి షోరూమ్‌లు, భూములు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. ఈ అక్రమ కార్యకలాపాలపై విదేశీ ప్రభుత్వాలు కూడా దాడులు నిర్వహించాయని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన 'జే బ్రాండ్స్' నాసిరకం మద్యం వల్ల కిడ్నీ, లివర్ వ్యాధులు, బ్రెయిన్ స్ట్రోక్‌లు వచ్చి అనేకమంది ప్రాణాలు కోల్పోయారని, దాదాపు 30 వేల మందికి పైగా మహిళలు చిన్న వయసులోనే వితంతువులుగా మారారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తిలో వాటా అడిగినందుకు సొంత తల్లిని, చెల్లిని బయటకు పంపిన చరిత్ర వారిదని విమర్శించారు.

ఐదేళ్ల పాటు సాగించిన దోపిడీ, దాడులను ప్రజలు ఇంకా మర్చిపోలేదని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవనే భయంతోనే ప్రస్తుత ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజాధనాన్ని దోచుకున్న అసలు శక్తులు అతి త్వరలోనే పూర్తిస్థాయిలో బయటకు వస్తాయని, చట్టం ముందు ఎవరూ తప్పించుకోలేరని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

హైదరాబాద్ భారత్ సమ్మిట్ వివాదం
ఇటలీ నేతపై చర్యలకు తెలంగాణ బీజేపీ డిమాండ్

-మొదటిపేజీ తరువాయి

చేసింది. నవంబర్ 12 నుంచి నవంబర్ 14 వరకు నగరంలో నిర్వహించిన ఈ సదస్సులో విదేశీ ప్రతినిధులు చేసిన ప్రసంగాలు దేశ సమగ్రతకు భంగం కలిగించేలా ఉన్నాయని బీజేపీ నేతలు ఆరోపించారు. ఎఫ్ఆర్ఆర్‌వో అధికారిని కలిసిన అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడారు. ఇటలీకి చెందిన యూరోపియన్ సోషలిస్ట్ పార్టీ నాయకుడు జియాకోమో ఫిలిబెక్ ఈ సదస్సుకు హాజరై భారత వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారంలో భాగంగా వాడుతున్న 'ఓట్ చోర్, గద్దీ చోడ్' అనే నినాదాన్ని ఆయన ఉద్దేశపూర్వకంగా ప్రస్తావించారని, ఇది స్పష్టంగా భారత అంతర్గత రాజకీయాల్లో జోక్యం చేసుకోవడమేనని మండిపడ్డారు. వీసా నిబంధనల ప్రకారం ఏ విదేశీయుడైనా తాను సందర్శించే దేశానికి వ్యతిరేకంగా మాట్లాడకూడదని రామచందర్ రావు గుర్తుచేశారు. అయితే అందుకు విరుద్ధంగా సదరు నేత భారత ప్రభుత్వం, ప్రజాస్వామ్య వ్యవస్థను కించపరిచేలా వ్యవహరించారని ఆరోపించారు. ఇటలీ ప్రతినిధి ఈ వ్యాఖ్యలు చేస్తున్న సమయంలో వేదికపై ఉన్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చప్పట్లు కొట్టడం, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నవ్వడం దేశాన్ని అవమానించడమేనని, కానీ వారికి ఆ విషయం అర్థం కాలేదని ఆయన విమర్శించారు. దేశాన్ని కించపరిచేలా వ్యవహరించిన ఈ చర్యకు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇద్దరూ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారెనర్స్ చట్టంలోని సెక్షన్ 23 ప్రకారం దేశానికి, దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించే విదేశీయులకు 3 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని, దీని ప్రకారం ఫిలిబెక్ పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత డిమాండ్ చేశారు. ఆ వ్యాఖ్యలు చేసిన అనంతరం సదరు వ్యక్తి దేశం విడిచి వెళ్లిపోయారని, అతడిని వెంటనే వెనక్కి రప్పించి చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. కేవలం ఆయనపైనే కాకుండా, ఇలాంటి వ్యక్తులను ఆహ్వానించి భారత గడ్డపై దేశానికి వ్యతిరేకంగా మాట్లాడేందుకు అవకాశం కల్పించిన సదస్సు నిర్వాహకులపై కూడా దేశద్రోహానికి సహకరించిన వారిగా కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు.

అలాగే భారత్ సమ్మిట్ నిర్వాహకులు, ఈ సదస్సుకు హాజరైన వారి పూర్వాపరాలపై లోతైన దర్యాప్తు జరపాలని రామచందర్ రావు కోరారు. జార్జ్ సోరోస్ వంటి శక్తుల నుంచి నిధులు పొంది, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి, దేశంలో అరాచకం సృష్టించేందుకే ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థలు పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు.

కిలో సన్నబియ్యం రూ.100!

-మొదటిపేజీ తరువాయి

ప్రభావంతో సాగు విస్తీర్ణం 78.23 లక్షల ఎకరాలకు తగ్గిందని గణాంకాలు సూచిస్తున్నాయి. దీంతో వరి దిగుబడులపై ప్రభావం పడుతుందన్న అంచనాలు మార్కెట్‌లో నెలకొన్నాయి.

మరోవైపు ఉమ్మడి నల్గొండ, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో పండే సన్నబియ్యానికి ఇతర రాష్ట్రాల్లోనూ మంచి డిమాండ్ ఉంది. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ధాన్యం నిల్వలు, మార్కెట్‌లో లభ్యతకు సంబంధించి స్పష్టమైన లెక్కలు వెల్లడికాకపోవడంతో ధరల పెరుగుదలకు అసలు కారణాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సన్నబియ్యానికి ప్రభుత్వ ధరలివే!

మార్కెట్‌లో పెరుగుతున్న ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం బియ్యాన్ని మూడు కేటగిరీలుగా విభజించి గరిష్ఠ ధరలను నిర్ణయించింది.

- బీపీటీ, కేఎన్ఎం: కిలో రూ.66
- ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా: కిలో రూ.74
- హెచ్ఎంటీ, జేఎస్ఆర్, జైశ్రీరామ్: కిలో రూ.79

నిర్ణయించిన ధరలకు మించి విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ బృందాలతో తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ నిల్వలు, అధిక ధరల విక్రయాలపై నిఘా పెట్టింది. నిత్యావసర వస్తువుల చట్టం కింద చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

మిల్లుల్లోనే 70 విక్రయ కేంద్రాలు

వినియోగదారులకు తక్కువ ధరకు బియ్యం అందించేందుకు మిర్యాలగూడలో ప్రత్యేక విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మిల్లర్ల సహకారంతో మిల్లుల్లోనే సుమారు 70 రిటైల్ కౌంటర్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలన్నది ఈ కేంద్రాల ప్రధాన ఉద్దేశం. ఈ విధానాన్ని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించాలని మిల్లర్లు భావిస్తున్నారు.

దోపిడీ అరికట్టేందుకు ప్రైస్ మానిటరింగ్ సెల్

బియ్యం ధరల నియంత్రణ కోసం జిల్లా స్థాయిలో ప్రైస్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేశారు. మార్కెట్‌లో ధరలు, నిల్వలు, సరఫరా పరిస్థితులను పర్యవేక్షించడంతో పాటు మిల్లర్లు, వ్యాపారుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. అవసరమైన ఇండెంట్ ఇస్తే మిల్లర్ల నుంచి నేరుగా బియ్యం నిల్వలు అందించేలా చర్యలు తీసుకుంటామని నల్గొండ జిల్లా అధికారులు చెబుతున్నారు. వదంతులను నమ్మి ధరలు పెంచితే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వ ధరలకు నాణ్యమైన బియ్యం ఎక్కడ?

ప్రభుత్వం ధరలు ప్రకటించినా మార్కెట్‌లో నాణ్యమైన సన్నబియ్యం ఆ ధరలకు లభించడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. నాణ్యమైన బీపీటీ బియ్యాన్ని మిల్లర్లు అధిక ధరలకు విక్రయిస్తుండటంతో తాము నిర్ణయించిన ధరలకు అమ్మలేకపోతున్నామని కొందరు రిటైలర్లు చెబుతున్నారు. దీంతో వ్యాపారం చేయలేక దుకాణాలు మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు నాన్-బీపీటీ రకాలను సన్నబియ్యం పేరుతో విక్రయిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారులు నాణ్యతా పరీక్షలు నిర్వహించి వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంది. బియ్యం ధరలను నియంత్రించాలంటే కేవలం హెచ్చరికలు, తనిఖీలతో సరిపోదు. మిల్లుల నుంచి రిటైల్ దుకాణాల వరకు సరఫరా వ్యవస్థను పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ఖర్చులు, హోల్‌సేల్ ధరలు, రిటైల్ ధరలపై సమగ్ర పరిశీలన జరగాలి. నాణ్యత విషయంలోనూ పారదర్శకత ఉండాలి.

మొయినాబాద్ టౌన్ ప్లానింగ్ అధికారినిపై
ఏసీబీ దాడులు.. అక్రమాస్తుల గుర్తింపు

ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో మొయినాబాద్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి గుండు వాణిపై ఏసీబీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సోమవారం హైదరాబాద్, మహబూబ్‌నగర్ సహా పలు ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఆమెకు సంబంధించిన నివాసం, బంధువుల ఇళ్లు, ఇతర ప్రాంతాలు కలిపి మొత్తం 10 చోట్ల సోదాలు నిర్వహిస్తున్నారు. రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. స్థిర, చరాస్తులు, బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీలు, ఆదాయ మార్గాలు, ఆస్తుల సమీకరణ వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఆదాయ వనరులకు మించి భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు వాణిపై ఆరోపణలు ఉన్నాయి. సెప్టెంబర్ 30న లంచం కేసులో ఆమె ఏసీబీకి పట్టుబడిన ఘటన ఈ దర్యాప్తునకు కారణమైంది. అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు రూ.75 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆమె తరఫున ఆ మొత్తాన్ని స్వీకరిస్తుండగా మొయినాబాద్ మున్సిపల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యాలమోని సుదర్శన్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి రూ.75 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు తర్వాత వాణిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసి తాజా సోదాలు చేపట్టారు.

ఐసీసీ చైర్మన్‌గా జై షా.. రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఛైర్మన్‌గా జై షా మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండోసారి ఈ పదవికి ఆయన పేరును ఐసీసీ బోర్డు ఖరారు చేసింది. బాలి వేదికగా జరిగిన బోర్డు సమావేశాల్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో అంతర్జాతీయ క్రికెట్‌లో జై షా నాయకత్వం మరోసారి కొనసాగనుంది. 2024 ఆగస్టులో తొలిసారి ఐసీసీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన జై షా.. అదే ఏడాది డిసెంబర్ 1న బాధ్యతలు చేపట్టారు. అప్పటికి ఆయన వయసు 35 ఏళ్లు. ఐసీసీ చరిత్రలో ఈ పదవిని చేపట్టిన అత్యంత పిన్న వయస్కుడిగా నిలిచారు. అప్పటి ఛైర్మన్ గ్రెగ్ బార్క్‌లే మూడోసారి పోటీకి ఆసక్తి చూపకపోవడంతో జై షా ఒక్కరే బరిలో నిలిచారు. ఐసీసీకి నాయకత్వం వహించిన ఐదో భారతీయుడిగా గుర్తింపు పొందారు. గతంలో జగ్మోహన్ దాల్మియా, శరద్ పవార్, ఎన్.శ్రీనివాసన్, శశాంక్ మనోహర్ ఈ బాధ్యతలు నిర్వహించారు. 2028లో లాస్ ఏంజిల్స్ వేదికగా జరిగే ఒలింపిక్స్‌లో క్రికెట్ తిరిగి చోటు దక్కించుకోవడం ఐసీసీ ముందున్న ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. ఈ నేపథ్యంలో జై షా రెండోసారి ఎన్నిక కావడం నాయకత్వంలో కొనసాగింపునకు దోహదపడుతుందని ఐసీసీ భావిస్తోంది. క్రికెట్‌ను మరిన్ని దేశాలకు విస్తరించడం, మహిళల క్రికెట్‌ను బలోపేతం చేయడం, అసోసియేట్ సభ్య దేశాలకు అవకాశాలు పెంచడం, ఆటకు దీర్ఘకాలిక ఆదాయ వనరులు కల్పించడం వంటి అంశాలపై దృష్టి పెట్టనున్నారు. తనపై మరోసారి విశ్వాసం ఉంచిన ఐసీసీ బోర్డు సభ్యులకు జై షా కృతజ్ఞతలు తెలిపారు. సభ్య దేశాలతో కలిసి ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనం కొత్త ప్రేక్షకులను ఆకర్షించేందుకు, యువతలో ఆటపై ఆసక్తి పెంచేందుకు గొప్ప అవకాశమని అభిప్రాయపడ్డారు. అభిమానులు, ఆటగాళ్లు, వాణిజ్య భాగస్వాముల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని క్రికెట్‌కు స్థిరమైన భవిష్యత్తును నిర్మించాల్సిన బాధ్యత ఉందన్నారు. జై షా కొనసాగింపును ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ రిచర్డ్ థాంప్సన్ స్వాగతించారు. ద్వైపాక్షిక సిరీస్‌ల ప్రాధాన్యాన్ని కాపాడుతూ అంతర్జాతీయ క్రికెట్ క్యాలెండర్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఐసీసీ స్వతంత్ర డైరెక్టర్ రోస్ రివాజ్ మహిళల క్రికెట్ అభివృద్ధికి మరిన్ని అవకాశాలు కల్పించాలని సూచించారు. జింబాబ్వే క్రికెట్ ఛైర్మన్, ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ తవెంగ్వా ముకుహ్లానీ.. 2027 పురుషుల వన్డే ప్రపంచకప్ ద్వారా ఆఫ్రికాలో క్రికెట్‌కు కొత్త అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ క్రికెట్ సమగ్రతను కాపాడటం, వివిధ ఫార్మాట్లకు ఆదరణ నిలబెట్టడం, అసోసియేట్ దేశాలకు ఉన్నతస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాలు పెంచడం కూడా ఐసీసీ ముందున్న ప్రాధాన్యాలుగా ఉన్నాయి.

ఎల్‌టీసీజీ పన్ను రేట్లు మారతాయా?
కేంద్రం నుంచి కీలక ప్రకటన

దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ) విధానంలో మార్పులు చేయాలన్న ప్రతిపాదనలపై కేంద్రం ఇప్పట్లో నిర్ణయం తీసుకునే అవకాశం లేదని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఛైర్మన్ రవి అగర్వాల్ స్పష్టం చేశారు. వచ్చే కేంద్ర బడ్జెట్‌కు ముందుగా ఈ అంశంపై తుది నిర్ణయం ఉండబోదని తెలిపారు. వివిధ వర్గాల నుంచి వచ్చిన సూచనలపై చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఢిల్లీలో సోమవారం ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో పన్ను చెల్లింపుదారుల లాంజ్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ విషయాలు చెప్పారు. ఎల్‌టీసీజీ పన్ను విధానాన్ని మరింత సరళీకరించాలని పరిశ్రమల సంఘాలు, పెట్టుబడిదారులు, మార్కెట్ వర్గాలు కొంతకాలంగా కోరుతున్నాయి. పన్ను రేట్లు, మినహాయింపుల నిబంధనల్లో మార్పులు చేయాలని ప్రతిపాదిస్తున్నాయి. 2027-28 కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో ఈ అంశంపై ఆసక్తి నెలకొంది. ఆదాయపు పన్ను రిఫండ్ల జారీ ప్రక్రియలో గణనీయమైన మెరుగుదల కనిపించిందని రవి అగర్వాల్ తెలిపారు. గత ఏడాది రిఫండ్లలో జాప్యం జరిగినప్పటికీ, ఈసారి ప్రక్రియలను క్రమబద్ధీకరించడం, గడువులను వేగవంతం చేయడం వల్ల సకాలంలో చెల్లింపులు జరుగుతున్నాయని చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి రిఫండ్ల మొత్తం 25 శాతం పెరిగిందని వెల్లడించారు. రిటర్నుల పరిశీలన, రిఫండ్ల జారీ ప్రక్రియల్లో ఎదురవుతున్న ఇబ్బందులను తగ్గించేందుకు ఆదాయపు పన్ను శాఖ చర్యలు తీసుకుందని వివరించారు.

రూ.26.97 లక్షల కోట్ల లక్ష్యంపై ఆశాభావం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు అంచనాల కంటే కొంత తక్కువగా ఉన్నాయని సీబీడీటీ ఛైర్మన్ అంగీకరించారు. అయినప్పటికీ 2026-27 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ప్రత్యక్ష పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఏడాది రూ.26.97 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. ఎల్‌టీసీజీ పన్ను విధానంలో మార్పులపై కేంద్ర బడ్జెట్‌కు ముందుగా నిర్ణయం తీసుకునే అవకాశం లేదని రవి అగర్వాల్ తెలిపారు. ప్రతిపాదనలపై చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈసారి ఆదాయపు పన్ను రిఫండ్లు గత ఏడాదితో పోలిస్తే 25 శాతం పెరిగాయని వెల్లడించారు.

తెలంగాణ పదో తరగతి విద్యార్థులకు ఊరట..



తెలంగాణలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు (ఎస్ఎస్సీ 2027) రాయబోయే విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ కీలక సమాచారం అందించింది. పరీక్ష ఫీజు చెల్లింపు గడువును పొడిగిస్తూ, సవరించిన నూతన షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేసింది. ఫీజు చెల్లింపు ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం.. ఎలాంటి ఆలస్య రుసుము (లేట్ ఫీజు) లేకుండా నవంబర్ 26 వరకు పరీక్ష ఫీజును చెల్లించవచ్చు. ఆ గడువు ముగిసిన తర్వాత రూ.50 ఆలస్య రుసుముతో డిసెంబర్ 8 వరకు అవకాశం కల్పించారు. రూ.200 అపరాధ రుసుముతో డిసెంబర్ 10 నుంచి డిసెంబర్ 21 వరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబర్ 23 నుంచి జనవరి 4 వరకు ఫీజు చెల్లించేందుకు వెసులుబాటు కల్పించారు.

ఫీజుల వివరాలను పరిశీలిస్తే..

రెగ్యులర్ విద్యార్థులు మూడు లేదా అంతకంటే ఎక్కువ సబ్జెక్టులు రాసేందుకు రూ.125 ఫీజుగా నిర్ణయించారు. మూడు సబ్జెక్టుల వరకు మాత్రమే రాసేవారు రూ.110 చెల్లించాల్సి ఉంటుంది. ఒకేషనల్ కోర్సు విద్యార్థులు రెగ్యులర్ ఫీజుకు అదనంగా మరో రూ.60 చెల్లించాలి. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులకు పరీక్ష ఫీజు నుంచి పూర్తి మినహాయింపు ఇచ్చారు. పరీక్ష ఫీజు చెల్లింపు విధానంపై విద్యాశాఖ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఫీజు మొత్తాన్ని అధికారిక వెబ్‌సైట్ ఎంవీ.వశ్రీఖఅస్త్రుఖు.స్త్రశీజ.అఅ ద్వారా కేవలం ఆన్‌లైన్ పద్ధతిలోనే పాఠశాల లాగిన్ ఉపయోగించి చెల్లించాల్సి ఉంటుంది. మాన్యువల్ ఐఎఫ్ఎంఎస్ (xఖీమీ) చలాన్లు లేదా బ్యాంకుల ద్వారా నేరుగా తీసే ఫిజికల్ చలాన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించబోమని స్పష్టం చేసింది. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల వివరాలను పరిశీలించి, నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

ప్రకారం ఈ తుపాను నెల్లూరు నుంచి తుని మధ్య ఆంధ్రప్రదేశ్, యానాం తీరాలను నవంబర్ 20 మధ్యాహ్నం దాటే అవకాశం ఉంది. ఆ సమయంలో గంటకు 120--130 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే ప్రమాదం ఉందని, గాలుల వేగం గరిష్ఠంగా 145 కిలోమీటర్ల వరకు చేరవచ్చని హెచ్చరించింది.

ఏడు జిల్లాలపై ప్రభావం ఉండే అవకాశం

తుపాను ప్రభావం అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలతో పాటు పరిసర ప్రాంతాలపై ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. నవంబర్ 19, 20 తేదీల్లో కోస్తాంధ్ర, యానాం ప్రాంతాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది.

ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధం

తుపాను తీవ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ముందుగానే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచాలని చంద్రబాబు ఆదేశించారు. తుపాను కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ, పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. గతంలో కేంద్ర బృందం చేసిన సిఫార్సులను కూడా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

విద్యుత్ సరఫరా, వరద నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి

తుపాను కారణంగా విద్యుత్ స్తంభాలు, సరఫరా లైన్లు దెబ్బతింటే వెంటనే పునరుద్ధరించేలా సిబ్బంది, యంత్రాలను సిద్ధంగా ఉంచాలని సీఎం ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే అవకాశం ఉన్నందున వరద నీటిని సమర్థంగా మళ్లించే చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన చోట నీటిని రిజర్వాయర్లకు మళ్లించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. తుపాను నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని వాతావరణ శాఖ సూచించింది. తీరప్రాంత ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని, అత్యవసర పరిస్థితుల్లో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచిస్తున్నారు. వర్షాలు, బలమైన గాలుల నేపథ్యంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, పాత భవనాలకు దూరంగా ఉండటం అవసరం.

ఏపీలో రెండో విడత పంచాయతీ ఎన్నికల
నోటిఫికేషన్ విడుదల



-మొదటిపేజీ తరువాయి

పరిశీలన ఉంటుంది. తిరస్కరణకు గురైన అభ్యర్థులు 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అప్పీల్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ అప్పీళ్లపై 23న విచారణ జరిపి తుది నిర్ణయం తీసుకుంటారు. నామినేషన్ల ఉపసంహరణకు నవంబర్ 24 మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు విధించారు. అదే రోజు అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. నవంబర్ 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలను వెల్లడిస్తారు. గెలిచిన అభ్యర్థులతో ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తారు. ఏవైనా కారణాలతో పోలింగ్ నిలిచిపోతే, అవసరమైన చోట నవంబర్ 30న రీ-పోలింగ్ జరుపుతారు. రెండో విడతలో భాగంగా రాష్ట్రంలో 4,960 సర్పంచ్ పదవులకు, 49,224 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తొలి విడత పోలింగ్ నవంబర్ 26న, మూడో విడత డిసెంబర్ 2న జరగనుంది. ఈ మూడు దశల్లో కలిపి మొత్తం 13,167 సర్పంచ్, 1.32 లక్షలకు పైగా వార్డు సభ్యుల స్థానాలను భర్తీ చేయనున్నారు.

ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
గురువారం ,సెప్టెంబర్, 03, 2026
తెలుగు దైనీ

అక్రమ రవాణాపై పెనుమూరు పోలీసుల ప్రత్యేక నిఘా

● అక్రమ మద్యం, మత్తు పానీయాల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు : ఎస్ఐ శ్రీకాంత్



పెనుమూరు (ప్రజావాణి ప్రతినిధి) నవంబర్ 15పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలో ఎలాంటి అక్రమ కార్యకలాపాలు చోటుచేసుకోకుండా పెనుమూరు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ముఖ్యంగా అక్రమ మద్యం, మత్తు పానీయాల కొనుగోలు, విక్రయాలు, రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పెనుమూరు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని పలు ప్రాంతాలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నారని వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రభావితం చేసేందుకు అక్రమంగా మద్యం పంపిణీ చేయడం, మత్తు పానీయాలను రవాణా చేయడం వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు, నిందితులకు శిక్షలు పడేలా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, అక్రమ రవాణా లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ శ్రీకాంత్ కోరారు.

సామాజిక సేవకు అరుదైన గుర్తింపు.. ఎం. డేవిడ్‌కు గౌరవ డాక్టరేట్

● 25 ఏళ్లుగా అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేష సేవలు -- బెంగళూరులో ఘన సత్కారం



చిత్తూరు, నవంబర్ 15:సామాజిక సేవా రంగంలో గత 25 సంవత్సరాలుగా నిరంతరం విశేష సేవలందిస్తున్న చిత్తూరు జిల్లా, తవణంపల్లి మండలం, పుణ్య సముద్రం గ్రామానికి చెందిన ఎం. డేవిడ్‌గారికి గౌరవ డాక్టరేట్ అవార్డు లభించింది. ఆయన అందించిన సేవలను గుర్తించిన భారతీయ యూనివర్సిటీ, బెంగళూరు వారు నవంబర్ 12, 2026న బెంగళూరు నగరంలో ఘనంగా సత్కరించి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.
ఎం. డేవిడ్ గత 25 సంవత్సరాలుగా సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం, ప్రజల్లో చైతన్యం కల్పించడం వంటి కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. సామాజిక సేవను తన జీవిత లక్ష్యంగా చేసుకొని నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు.
ప్రస్తుతం నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లేబర్ రైట్స్ (NHRC) ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్నారు. ప్రజలకు ఎదురయ్యే సమస్యలపై స్పందిస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా తన వంతు సహకారం అందిస్తున్నారు.
రాజకీయ రంగంలోనూ ప్రజలతో మమేకమై సేవలందించిన ఆయన తవణంపల్లి మండలంలోని పుణ్య సముద్రం గ్రామ పంచాయతీకి ఎం.పీ.టీసీ (MPTC)గా పనిచేశారు. ప్రజాప్రతినిధిగా గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేశారు. అంతేకాకుండా జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఐఎవీజ) సభ్యుడిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా తన వంతు కృషి చేశారు.
అలాగే ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి సంబంధించిన జిల్లా, మండల స్థాయి కమిటీల్లో సభ్యుడిగా పనిచేస్తూ ఆయా వర్గాల సమస్యలు, హక్కులు, సంక్షేమ కార్యక్రమాలపై తన గళాన్ని వినిపించారు. సామాజిక సేవ, రాజకీయ రంగం, మానవ హక్కుల పరిరక్షణ, ప్రజా సంక్షేమం వంటి విభిన్న రంగాల్లో ఆయన అందించిన సేవలను పరిశీలించి,ఆయన సేవా ప్రస్థానాన్ని గుర్తిస్తూ భారతీయ యూనివర్సిటీ ఈ గౌరవ డాక్టరేట్‌ను అందించడం విశేషం.
ఒక వ్యక్తి తన స్వార్థం కోసం కాకుండా సమాజంలోని బలహీన వర్గాల అభ్యున్నతి కోసం దశాబ్దాల పాటు పనిచేస్తే గుర్తింపు తప్పక లభిస్తుందనే దానికి ఎం. డేవిడ్‌కు లభించిన గౌరవ డాక్టరేట్ నిదర్శనంగా నిలుస్తోంది. ఈ పురస్కారం ఆయన వ్యక్తిగత విజయమే కాకుండా తవణంపల్లి మండలానికి, చిత్తూరు జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.
25 ఏళ్లుగా ప్రజాసేవనే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎం. డేవిడ్‌కు గౌరవ డాక్టరేట్ లభించడంపై పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక సేవకులు, మానవ హక్కుల సంఘాల ప్రతినిధులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

పెనుమూరులో హైదరాబాద్ వాసి ఆత్మహత్య

● ఫ్యాన్‌కు ఉరివేసుకుని 63 ఏళ్ల వ్యక్తి మృతి

పెనుమూరు (ప్రజావాణి ప్రతినిధి) పెనుమూరు మండలంలో విషాద ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన 63 ఏళ్ల ప్రకాష్ రావు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.పెనుమూరు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌కు చెందిన ప్రకాష్ రావు బెంగళూరులోని ఓ దుకాణంలో పనిచేస్తూ, పెనుమూరు మండలం శాతంభాకంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం తన నివాసంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసు సిబ్బంది కిరణ్, వేదనాయగం, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్న మంత్రి సవిత



అనంత పురం నవంబర్ 15 ప్రజా వాణి విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తనయుడితో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన పాలకమండలి సభ్యులు, అధికారులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు అమ్మవారి ఆశీర్వచనాలు అందించి, అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు. దర్శనానికి వచ్చిన భక్తులతో మంత్రి సవిత స్వయంగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆలయంలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఏర్పాట్లపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.భక్తులు ఆలయంలోని సౌకర్యాల పట్ల సంతృప్తి వ్యక్తం చేయడం పట్ల మంత్రి సవిత ఆనందం వెలిబుచ్చారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు వీరంకి వెంకట గురుమూర్తి, పేరేపీ ఈశ్వర్ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ క్లబ్ ఎన్నికల్లో కెప్టెన్ లక్ష్మీకాంత రావు గారి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి గారు



హుజూరాబాద్ ప్రజావాణి నవంబర్ :15 హుజూరాబాద్ క్లబ్ ఎన్నికల సందర్భంగా ఈరోజు గౌరవ మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంత రావు గారు, హుజూరాబాద్ శాసనసభ్యులు శ్రీ పాడి కౌశిక్ రెడ్డి గారు, మాజీ ఎమ్మెల్యే శ్రీ వొడితల సతీష్ బాబు గారు మరియు ఇంద్రనీల్ గారు హుజూరాబాద్ క్లబ్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించి, ప్రజాస్వామ్య పద్ధతిలో తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. క్లబ్ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, భవిష్యత్తు ప్రగతిని దృష్టిలో ఉంచుకుని సభ్యులు తమ విలువైన ఓటును వినియోగించుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం హుజూరాబాద్ క్లబ్ ఎన్నికల్లో వివిధ పదవులకు పోటీ చేస్తున్న అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నికల్లో విజయం సాధించిన వారు, క్లబ్ అభివృద్ధికి మరియు సభ్యుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు.హుజూరాబాద్ క్లబ్ ఎన్నికలు స్నేహపూర్వక వాతావరణంలో, ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశాంతంగా కొనసాగాలని వారు ఆకాంక్షించారు.

విప్లవ గెడ్డ బొడ్డపాడులో కూటమి అభ్యర్థి కిక్కర పుణ్యావతి డిల్లేరావు నామ పత్రాలు దాఖలు చేశారు

- భారీ ఎత్తున అభిమానులు తో నామనేషన్ ను వేసిన కిక్కర పుణ్యావతి డిల్లీ రావు
- రెండోసారి తెలుగు దేశము సర్పంచ్ గా పోటీ చేస్తున్న కిక్కర..పుణ్యవతి డిల్లీ రావు
- తొలి సారిగా విప్లవ వామపక్ష పార్టీలు తెలుగు దేశము పార్టీ కు చెందిన బొడ్డు సుధాకర్ ను ఇక్కడ సర్పంచి గా గెలిపించారు.
- గెలిచిన అభ్యర్థి నీ ఆనాటి ఎమ్మెల్యే గౌతు శివాజీ సహాయము తో సీఎం చంద్ర బాబు నాయుడు ను కలిశారు.
- రాజకీయకులు అతీతంగా పంచాయతీ ను అభివృద్ధి చేస్తా?
- బొడ్డపాడు సర్పంచ్ అభ్యర్థి కిక్కర పుణ్యావతి డిల్లీ రావు



పలాస, ప్రజావాణి ప్రతినిధి పలాస మండలము విప్లవ గెడ్డ బొడ్డపాడులో కూటమి అభ్యర్థి కిక్కర పుణ్యావతి డిల్లీ రావు లు ఆదివారము నామ పత్రాలను దాఖలు చేశారు. పంచాయతీ లోని బొడ్డపాడు అలాగే మామిడిపల్లి , కాలనీ వాసులు పెద్ద ఎత్తున కిక్కర డిల్లీ రావు అభిమానులు కాలినడకన సుమారు రెండు కిలోమీటర్ల వరకు వెళ్లి కిక్కరకు సంఘీభావం తెలిపారు. బొడ్డపాడు పంచాయతీని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని కిక్కర పుణ్యావతి డిల్లీ రావు స్పష్టము చేశారు . కూటమి సర్కారు అధికారము లోకి వచ్చాక ఇక్కడ పంచాయతీ లోని యాపోటి రోడ్డు ను తారు రోడ్డు నిర్మాణము చేసిన ఘనత ఇక్కడ ఎమ్మెల్యే గౌతు శిరీష కే దక్కుతుంది అని గుర్తు చేశారు.
విప్లవ గెడ్డ అయినా బొడ్డపాడు లో తొలిసారి యాదవ సామాజిక వర్గము సర్పంచ్ అభ్యర్థి కిక్కర పుణ్యావతి డిల్లీ రావు పోటీ చేయనున్నారు. గత ఎన్నికల్లో కిక్కర డిల్లీ రావు సర్పంచ్ గా పోటీ చేసి గెలిచి ఓడిపోయారు.
అని ప్రచారము.ఉంది. ఇక్కడ చర్చ జరుగుతుంది.
పంచాయతీ వ్యవస్థ ఏర్పాటు నుంచి నేటి వరకు బొడ్డపాడు పంచాయితీ కు అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గం వారే ఇక్కడ సర్పంచులు గా అదికార పీఠము పై కూర్చున్నారు.
కూటమి సర్కారు చేస్తున్న అభివృద్ధి చూసి కులాలకు అతీతంగా ఇక్కడ ఎంపీటీసీ అభ్యర్థిగా మామిడి వ ల్లకి చెందిన మురిపింటి కుమార్ రాజును 629 ఓట్లు మెజార్టీతో గెలిపించారు.



అభివృద్ధికి కులాలు సమస్య కాదని ఇక్కడ రుజువు చేశారు.
ప్రస్తుతం ఈనెల 26న జరగనున్న సర్పంచ్ ఎన్నికల ఫలితాల్లో కూటమి అభ్యర్థిగా కిక్కర పుణ్యావతి డిల్లేరావు రావు గెలిచేందుకు అపకాశాలు ఉన్నాయ ని పలుపురు వెల్లడిస్తున్నారు.
కిడిసింగి గ్రామానికి చెందిన పుణ్యావతి
బొడ్డపాడు సర్పంచ్గా పోటీలో. అన్నారు
విప్లవ గడ్డం బొడ్డపాడు పంచాయతీకి సర్పంచ్ గా పోటీ చేస్తున్న కిక్కర పుణ్యావతి నేపద్యం ప్రకారం ఆమెది వజ్రపుకొత్తూరు మండలం కిడిసింగి గ్రామానికి చెందిన వ్యక్తి.. ప్రస్తుతం కిక్కర. ధిల్లీ రావు వివాహం చేసుకోవడం వలన బొడ్డపాడుకు కోడలుగా వచ్చింది. కిక్కర పుణ్యావతి డిల్లీ రావు బొడ్డపాడు సర్పంచ్గా ఆదివారం నాడు నామ పత్రాలను దాఖలు చేశారు.నామినేషన్ కార్యక్రమానికి బొడ్డుపాడు ఎంపీటీసీ ఎం కుమార్ రాజ్,సీనియర్ నాయకుడు ఎం కర్రయ్య , బొడ్డు దుష్యంత, గుర్తము తులసిరావు,సార.జోగారావు పెద్దఎత్తున అభిమానులు పాల్గొన్నారు

కామ్రేడ్ చండ్రపుల్లా రెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం

● కర్నాకుల ఆంజనేయులు



పలాస ప్రజా వాణి ప్రతినిధి గోదావరిలోయ ప్రతిఘటన పోరాట నిర్మాత,భారత విప్లవోద్యమ అగ్రనేత కామ్రేడ్ చండ్ర పుల్లారెడ్డి 42వ వర్ధంతి సభను ఆంధ్రప్రదేశ్ రైతు-కూలి సంఘం జిల్లా అధ్యక్షుడు వి.రాజబాబు అధ్యక్షతన ఆదివారం నాడు రంగంపేట మండలం సింగంపల్లి శివారు సిపి రెడ్డి నగర్లో నిర్వహించడం జరిగింది. ముందుగ భూమి,భుక్తి, విముక్తి కోసం అసువులు బాసిన విప్లవ అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రైతు-కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ కామ్రేడ్ చండ్రపుల్లారెడ్డి గోదావరి లోయలో భూపోరాటం చేసి లక్షల ఎకరాల భూములను ప్రజల పరం చేశారని గుర్తు చేశారు. ఆ స్ఫూర్తితోనే ఆంధ్రప్రదేశ్ రైతు-కూలీ సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో వేలాది ఎకరాల మిగులు, భూదాన,దేవాదాయ ధర్మాదాయ భూములను ప్రజల పరం చేసేందుకు రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని ఆయన తెలిపారు. దేశ పౌరుల ఓటు హక్కుతో చలగాటమాడే ఎన్నికల కమీషన్ ఈసీచర్యలు భారత రాజ్యంగానికి గొడ్డలి పెట్టు అని,ఓట్ల క్రమబద్ధీకరణ పేరుతో కోట్లాది యువత (జెన్ జీ)ఓట్లను తొలగించడం సిగ్గు చేటుగా అభివర్ణించారు. రాజ్యాంగ పదవులను దుర్వినియోగం చేస్తున్న ఎన్నికల కమీషన్ ప్రధాన అధికారిని డిస్మిస్ చేయాలని ఆయన ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.సిపి రెడ్డి నగర్ పోరాడి సాదించుకొని దశాబ్దాలు గడుస్తున్న పాలకులు,అధికారులు కనీసం మౌలిక వసతులు కల్పించకపోవడం సిగ్గు చేటుగా అభివర్ణించారు. ఇల్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్న 300 కుటుంబాలకు పట్టాలు మంజూరు చేసి,పక్క గ్రహాలు నిర్మించాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు-కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ నాయకులు సత్తిబాబు, ఏ ఇ ఎఫ్ టీ యు జిల్లా అధ్యక్షుడు మడికి సత్యం,ప్రధాన కార్యదర్శి కుంచే అంజిబాబు, (స్త్రీ విముక్తి) జిల్లా కన్వీనర్ దుర్గాదేవి, గ్రామ కమిటీ నాయకులు చెక్క సత్తిబాబు, రత్నం,సత్తక్క,ద్రాక్షపల్లి,రాజు, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.వల్లూరి రాజబాబు,
జిల్లా అధ్యక్షులు,ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ.



బాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి

● 16వ తేదీన బాలల ప్రజావాణి
● జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల,ప్రజావాణి బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 16వ తేదీన సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సాధారణ ప్రజావాణితో పాటు బాలల ప్రత్యేక ప్రజావాణి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.పిల్లల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎ+రాజ్యాజ=) ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 16 వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో సాధారణ ప్రజావాణితోపాటు ప్రత్యేకంగా 'బాలల ప్రజావాణి' నిర్వహించాలని నిర్ణయించింది.ఈ బాలల ప్రజావాణిలో బాలలకు సంబంధించిన విద్య, ఆరోగ్యం, పోషకాహారం, బాలల హక్కుల పరిరక్షణ, బాలల భద్రత, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, అనాథ, సంరక్షణ అవసరమైన బాలల సమస్యలు, బాలల అభివృద్ధి తదితర అంశాలపై ఫిర్యాదులు, వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు.అలాగే బాలలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకుపచ్చి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. బాలల సంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న వ్యక్తులు కూడా తమ పరిధిలోని బాలల సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. బాలలకు మెరుగైన భవిష్యత్తును అందించడంతోపాటు, వారి హక్కులను కాపాడి, సమస్యలకు పరిష్కారం చూపడమే బాలల ప్రజావాణి ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.



ప్రజావాణి RNI NO:TGTEL/25/A5443 గురువారం ,సెప్టెంబర్, 03, 2026 తెలుగు దైనిక
మంగళవారం 17 నవంబర్ 2026

బెల్ట్ షాపుల్లో మద్యం దోపిడీకి అడ్డుకట్ట వేయరా..?

- అధికారులకు ఉప సర్పంచ్ హెచ్చరిక..
- పట్టించుకోకపోతే కలెక్టర్ ప్రజావాణిలో ఫిర్యాదు!
- మద్యం ఎమ్మార్పీ ధరల కంటే అధిక వసూళ్లు..
- సామాన్యుల జేబులకు చిల్లులు



కోనరావుపేట, ప్రజావాణి మండల పరిధిలోని మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా వసూళ్లు చేస్తూ సామాన్య ప్రజలను దోచుకుంటున్నారని ధర్మారం ఉప సర్పంచ్ వెలిశాల శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోనరావుపేట మండలంలోని మర్తన్నపేట, నిమ్మపల్లి, కోనరావుపేట గ్రామాల్లో ఉన్న మూడు వైన్ షాపుల నిర్వాహకులు బెల్ట్ షాపులకు అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని ఆరోపించారు. దీంతో బెల్ట్ షాపుల నిర్వాహకులు సైతం వినియోగదారుల నుంచి ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలు వసూలు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.ఈ అక్రమ వసూళ్లపై వైన్ షాపుల నిర్వాహకులను ప్రశ్నించినా, ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కష్టపడి పనిచేసుకునే కూలీలు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

అధికారులు ఇప్పటికైనా స్పందించాలి..

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న వైన్ షాపులపై సంబంధిత అధికారులు వెంటనే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యను అధికారులు పట్టించుకోకపోతే త్వరలోనే తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తామని, కలెక్టర్ నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.మద్యం అధిక ధరల వసూళ్లకు అడ్డుకట్ట వేసేందుకు ప్రజలంతా ఏకమై తమకు మద్దతుగా నిలవాలని ధర్మారం ఉప సర్పంచ్ వెలిశాల శ్రీనివాస్ కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం...

- 31వ వార్డులో రూ.3 లక్షలతో సీసీ మురికినీటి కాలువ నిర్మాణ పనులకు శ్రీకారం
- భూమిపూజ చేసి పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి



సిరిసిల్ల, ప్రజావాణి సిరిసిల్ల పట్టణంలోని 31వ వార్డులో ప్రజలకు మౌలిక వసతులు కల్పించే దిశగా మరో అభివృద్ధి పనికి శ్రీకారం చుట్టారు. వార్డులో నెలకొన్న మురికినీటి కాలువ సమస్యకు పరిష్కారం చూపుతూ రూ.3 లక్షల మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో చేపట్టనున్న సీసీ మురికినీటి కాలువ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. 31వ వార్డులో మురికినీటి కాలువ సమస్యను కౌన్సిలర్ పాశికంటి రమ్య సత్యనారాయణ తమ దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించి రూ.3 లక్షల నిధులు కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తూ, పాలకవర్గ సభ్యులందరి సహకారంతో సిరిసిల్ల పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. చేపట్టిన కాలువ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత మున్సిపల్ అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల నందీప్, కౌన్సిలర్లు పాశికంటి రమ్య సత్యనారాయణ, దొంతునేని కళ్యాణి అశోక్ రావు, గుండ్లపల్లి నీరజ పూర్ణచందర్, ఎలుక వెంకటేశం, అడిచెర్ల రూప సాయికృష్ణ, గెంట్యాల శ్యామల శ్రీనివాస్, కొండ వర్షిని నరేష్, బత్తుల రమేష్, మున్సిపల్ అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బింగి ఇజ్జగిరి, పాశికంటి లవన్ కుమార్, కమలాకర్ తదితరులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నకిలీ డెత్ సర్టిఫికెట్లు.. లేబర్ కార్డుల దందా!

- పేదల పేర్లతో ప్రభుత్వ సొమ్ము స్వాహా చేస్తున్నారా?
- అక్రమాల వెనుక అసలు సూత్రధారులెవరు..?
- ఫిర్యాదులు చేసినా అధికారుల మౌనం ఎందుకు?

రాజన్న సిరిసిల్ల, ప్రజావాణి

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కోదురుపాక గ్రామంలో నకిలీ మరణ ధృవపత్రాలు, లేబర్ కార్డుల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సామాన్య ప్రజల పేర్లను, మరణించిన వ్యక్తుల వివరాలను ఆసరాగా చేసుకుని నకిలీ ధృవపత్రాలు సృష్టించి ప్రభుత్వ పథకాల నిధులను అక్రమంగా పొందుతున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గ్రామానికి చెందిన మైలారం శ్రీనివాస్ అనే వ్యక్తి దళారీగా



వ్యవహరిస్తూ ఈ అక్రమాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదుదారుడు ఆరోపిస్తున్నారు. అయితే ఈ వ్యవహారంలో మరికొందరి పాత్ర ఉందా? ప్రభుత్వ కార్యాలయాల్లోనే ఈ అక్రమాలకు సహకారం అందుతోందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రశ్నిస్తే బెదిరింపులా..? ఫిర్యాదులకు స్పందన ఏదీ?

అక్రమాలను ప్రశ్నిస్తున్న వారిని బెదిరిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించరా..?

నకిలీ ధృవపత్రాల జారీ వెనుక ఉన్న అసలు వ్యక్తులెవరు? ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగిస్తున్న ఈ వ్యవహారంపై విచారణకు అధికారులు ఎందుకు ముందుకు రావడం లేదు? ఆరోపణల్లో వాస్తవం ఎంత? అన్నది తేలాల్సి ఉంది. ఉన్నతాధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మియాపూర్ లో ఘనంగా కమ్మ సంఘం 30వ కార్తీక వన భోజన మహోత్సవం

- ముఖ్యఅతిథిగా హాజరైన PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ

కూకట్‌పల్లి, నవంబర్ 15 (ప్రజావాణి) మియాపూర్ డివిజన్ పరిధిలోని నరేన్ గార్డెన్స్ లో కమ్మ సంఘం ఆధ్వర్యంలో 30వ కార్తీక మాస వన భోజన మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పఠాన్ చెరువు, బీహెచ్ఈఎల్, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్ ప్రాంతాల కమ్మ సంఘం సంయుక్తంగా ఈ వేడుకను ఏర్పాటు చేసింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీఏసీ చైర్మన్ శ్రీ ఆరెకపూడి గాంధీ గారు హాజరై ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్తీక మాసంలో జరుపుకునే వన భోజనాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. ప్రకృతితో మమేకమై, బంధుమిత్రులతో కలిసి



ఉసిరి చెట్టు నీడన భోజనం చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. వన భోజనాల వల్ల ఆయుర్వేద మొక్కల నుండి వచ్చే స్వచ్ఛమైన గాలి దివ్య ఔషధంగా పనిచేస్తుందని, పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. "ప్రకృతిని కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుంది" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ చైర్మన్



బండి రమేష్, టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ చైర్మన్ మన్నే సతీష్ కుమార్, లయన్ ఘట్టమనేని బాబురావు, మొవ్వ సత్యనారాయణ, ప్రైమ్ మార్క్ అధినేత సాంబశివరావు, డీసీలు బాలకృష్ణ, తాన్య, మాజీ కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.కమ్మ సంఘం కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కార్తీక మాస వనభోజనాలతో ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యత -- PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ

- మయూరి నగర్ రాక్ గార్డెన్ పార్క్‌లో ఘనంగా కార్తీక మాస వనభోజన మహోత్సవం

కూకట్‌పల్లి, నవంబర్ 15: (ప్రజావాణి) మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీలో గల రాక్ గార్డెన్ పార్క్‌లో దివ్య శ్రీ శక్తి అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక మాస వనభోజన మహోత్సవంలో గ్రామాజ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే శ్రీ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తాజా మాజీ కార్పొరేటర్ శ్రీ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని కాలనీవాసులతో ఆనందంగా గడిపారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. కార్తీక మాసంలో వనభోజన మహోత్సవాలు నిర్వహించుకోవడం ఎంతో సంతోషకరమని అన్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, కాలనీవాసులు ప్రకృతి ఒడిలో, ముఖ్యంగా ఉసిరి చెట్టు నీడన కలిసి భోజనం చేయడం మన





సంప్రదాయంలో విశిష్టమైన ఆచారమని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రకృతితో మనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తాయని తెలిపారు.వనభోజనాల వెనుక కేవలం ఆధ్యాత్మికత మాత్రమే కాకుండా ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి గొప్ప సందేశాలు దాగి ఉన్నాయని గాంధీ వివరించారు. చెట్లు, మొక్కల ప్రాధాన్యతను గుర్తించి పచ్చదనాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రకృతిని మనం కాపాడుకుంటే ప్రకృతి మనల్ని కాపాడుతుందని పేర్కొన్నారు.అంతేకాకుండా వనభోజనాలు వంటి సామూహిక కార్యక్రమాల ద్వారా నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందుతాయని, బంధుమిత్రుల మధ్య సాన్నిహిత్యం మరింత బలపడి సమాజంలో ఐక్యత, సోదరభావం పెరుగుతాయని అన్నారు.ఇలాంటి సంప్రదాయ కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని, భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని గాంధీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో దివ్య శ్రీ శక్తి అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ సభ్యులు, కుటుంబ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

నూతన ఎసిబి కార్యాలయాన్ని ప్రారంభించిన ఎసిబి డీఎస్పీ వై రమేష్



ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ కార్యాలయం ఖమ్మంలోని విడోస్ కాలనీ నుండి పాత మున్సిపాలిటీ ఆఫీసులోకి నూతన కార్యాలయాన్ని ఆదివారం ఏసిబి డిఎస్పీ వై.రమేష్ ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసీబీ పట్ల ప్రజలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నామని అనేక అవగాహన ప్రభుత్వ కార్యాలయలో కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.ఏదైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు అందించాలని ఆయన సూచించారు.వివరాలు గోప్యంగా ఉస్తామని అవినీతి అక్రమాల అరికట్టడంలో ప్రజలకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సబ్సిడీపై విత్తనాలు పైపులు అందించబడును



చిలిపిచెడ్. నవంబర్ 15 మన ప్రజావాణి నియోజకవర్గ ప్రతినిధి చిలిపిచెడ్ మండలంలో యాసంగిలో వరికి బదులు జొన్న, మొక్కజొన్న, కుసుమ, పొద్దుతిరుగుడు, నువ్వులు, పెసర్లు, మినుములు, అలసందలు, వేరుశనగ, కూరగాయలు వంటి ఆరుతడి పంటలు వేయాలనుకునే రైతులు సోమవారం సాయంత్రం 5 గంటలలోగా మండల వ్యవసాయ అధికారికి వివరాలు ఇవ్వగలరు.సబ్సిడీపై విత్తనాలు, సోలార్ ఫెన్సింగ్, డ్రిప్, స్ప్రింక్లర్ కావాలనుకునే రైతులు కూడా వివరాలు తెలియజేయగలరు. ఏ ఓ రాజశేఖర్ గౌడ్ తెలిపారు

ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి





నారాయణఖేడ్ నియోజకవర్గం:-(ప్రజావాణి)ఇంచార్జ్ మదునుదన్

నారాయణఖేడ్: నియోజకవర్గ పరిధిలోని గునుకుల కుంట గ్రామంలో నిరుడి జగన్ నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకకు, అలాగే పెద్ద శంకరంపేట మండలం కోలపల్లి గ్రామపంచాయతీ పరిధికి చెందిన గోవిందరావు పటేల్ నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహ యజమానుల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి,ఈ సందర్భంగా పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. సొంతింటిని నిర్మించుకోవాలనే ఎన్నో ఏళ్ల కల నెరవేరడం సంతోషకరమని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడ్ మండల కేంద్రంలోని లిటిల్ చాంపియన్స్ స్కూల్ లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

- కరెస్పాండెంట్ పిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో





నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి గుర్రంపోడ్ మండల కేంద్రంలోని లిటిల్ చాంపియన్స్ స్కూల్ లో కరస్పాండెంట్ పిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలను రంగురంగుల బెలూన్లు, పూలతో అలంకరించారు. చిన్నారులు రంగురంగుల దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం విద్యార్థులు పాటలు, నృత్యాలు, ఆటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లలే దేశ భవిష్యత్తు అని, చిన్ననాటి నుంచే మంచి సంస్కారం, క్రమశిక్షణ, చదువుతో పాటు సాంస్కృతిక విలువలు నేర్పించాలని తెలిపారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ?ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పిల్లి శ్రీనివాస్, డైరెక్టర్ రొండి వెంకన్న, ఇంచార్జిలు కదారి స్వామి, విజయ్ ఉపాధ్యాయులు బండారు ఉపేందర్, రాజు, సుధాకర్, నాగేంద్ర, పరిమళ, చంద్రకళ, అఖిల, షబానా, శిల్ప, సుబ్బి, సొనాలి, తపస్విని, నైసీ, నీలిమ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ జాతీయ మహాసభకు భారీగా తరలి వెళ్ళిన కురవి మండల రైతులు



డోర్నకల్ నియోజకవర్గ ప్రతినిధి, నవంబర్ 15 ప్రజావాణి: నల్గొండ పట్టణంలో 36వఅఖిల భారత కిసాన్ జాతీయ మహాసభకు కురవి మండల రైతుల బస్సులను సిపిఎం మండల కార్యదర్శి పిట్టల వెంకన్న జెండా ఊపి ప్రారంభించారు . బలపాల, రాజోలు, నేరడ, కురవి, కందికొండ తదితర గ్రామాల నుండి బస్సుల ద్వారా వందలాది మంది రైతులు నల్గొండ మహాసభకు తరలి వెళ్లారు.ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సల్లపు సుధాకర్, సీపీఎం కురవి మండల కార్యదర్శి పిట్టల వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గంధసిరి శ్రీనివాస్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మాలోత్ కిషన్ మాట్లాడుతూ, జాతీయ మహాసభ బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన రైతులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో జరిగే రైతు ఉద్యమంలోనూ ఇదే స్ఫూర్తితో పాల్గొనాలని కురవి మండల రైతులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సల్లపు సుధాకర్ , కడియం సత్యం, నాలాం వెంకన్న, కట్ల కృష్ణయ్య, రాయల మనోహర్, జక్కుల మల్లయ్య, పిట్టల మోహన్ రావు, మైసూర్, గోపి రామ్మూర్తి, మాధవరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
గురువారం , సెప్టెంబర్, 03, 2026
తెలుగు దైనిక
మంగళవారం 17
నవంబర్ 2026

మఠంపల్లిలో ఘనంగా 1985-86 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.



హుజూర్‌నగర్ నవంబర్ 15 (ప్రజావాణి) సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గం మఠంపల్లి మండలంలోని వి ఆర్ ఎల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో 1985-86 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి ఎ ఁ బి సెక్షన్ల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సుమారు 40 ఏళ్ల నాటి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ పూర్వ విద్యార్థులు ఆనందంగా గడిపారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పాత స్నేహాలను గుర్తు చేసుకున్నారు. ఈ సమ్మేళనంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, వినోదభరితమైన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేసి ఉత్సాహపరిచారు.ఈ కార్యక్రమానికి కొత్త మంగమ్మ, అనూష రవీందర్ రెడ్డి ఆతిథ్యం అందించారు.ఈ ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు సమ్మిడి శ్రీనివాస్ రెడ్డి, జోగు శ్రీనివాస్ రెడ్డి, టి. సత్యనారాయణ రెడ్డి, కిష్టిపాటి వెంకటరెడ్డి, జనార్దన్ రెడ్డి, సిస్టర్ ఇన్నాసమ్మ, తెరిస్సా, కరుణాకర్ రెడ్డి, అనంత రెడ్డి, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి, రామ్‌నాథ్ తదితరులతో పాటు సుమారు 65 మంది పూర్వ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.చదువుకున్న పాఠశాల రోజులు, చేసిన అల్లరి, గురువులతో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకుంటూ ఈ సమ్మేళనాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఆత్మీయ పలకరింపులతో సందడి చేశారు. ఇలాంటి సమ్మేళనాలు పాత స్నేహబంధాలను మరింత బలోపేతం చేస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.

మంథనిలో 14 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

● నేడు సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు



మంథని నియోజకవర్గ ప్రతినిధి, నవంబర్ 15, ప్రజావాణి:మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ సోమవారం మండలంలోని 14 గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు. సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ చేతుల మీదుగా ఈ కేంద్రాలు ప్రారంభం కానున్నాయి.

ప్రారంభోత్సవాల షెడ్యూల్:

ఎక్లాస్‌పూర్ -- ఉదయం 9 గంటలు
ఖానాపూర్ -- ఉదయం 9.30 గంటలు
బిట్టుపల్లి -- ఉదయం 10 గంటలు
గర్డలపల్లి -- ఉదయం 10.30 గంటలు
గోపాల్‌పూర్ -- ఉదయం 11 గంటలు
చిన్న ఓదెల -- ఉదయం 11.30 గంటలు
పుట్టపాక -- మధ్యాహ్నం 12 గంటలు
నగరంపల్లి -- మధ్యాహ్నం 12.30 గంటలు
మహబూబ్‌పల్లి -- మధ్యాహ్నం 1 గంట
అక్కేపల్లి -- మధ్యాహ్నం 1.30 గంటలు
కన్నాల -- సాయంత్రం 3.30 గంటలు
నాగారం -- సాయంత్రం 4 గంటలు
గుంజపడుగు -- సాయంత్రం 4.30 గంటలు
సిరిపురం -- సాయంత్రం 5 గంటలు ఈ కార్యక్రమాలకు సంఘ పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, రైతులు, పాత్రికేయులు హాజరై విజయవంతం చేయాలని పీఏసీఎస్ కార్యదర్శి బొద్దుల సమ్మయ్య కోరారు.

యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయండి

● ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వ్యవసాయ శాఖ సూచన

● పెసర, మినుములు, శనగ, జొన్న, మొక్కజొన్న విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో



మంథని నియోజకవర్గ ప్రతినిధి, నవంబర్ 15, ప్రజావాణి: ఎల్‌నినో ప్రభావం, మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ యాసంగి సీజన్‌లో రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ సూచించింది. పెసర, మినుములు, శనగ, జొన్న, మొక్కజొన్న తదితర పంటల విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని తెలిపింది.అలాగే కూరగాయల విత్తనాలు, మల్చింగ్ షీట్లు, ఆయిల్ పామ్ సాగుకు కూడా అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఆసక్తి గల రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ వివరాలను సంబంధిత ఏఈఓలకు అందించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరింది. ఆసక్తిగల రైతులు ఫోన్ నంబర్: 75699 45062 లో సంప్రదించాలని కోరింది.

మంథని పట్టణ అభివృద్ధి పనులు వేగవంతం

● నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ పొడ్వాల శ్రీనివాస్





మంథని నియోజకవర్గ ప్రతినిధి, నవంబర్ 15, ప్రజావాణి:మంథని పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ పొడ్వాల శ్రీనివాస్ అధికారులకు సూచించారు. ఆదివారం సూతస మున్సిపల్ కార్యాలయం, ఇంటిగ్రేటెడ్ వెజిటబుల్ మార్కెట్, బస్‌స్టాండ్, రావుల చెరువు వద్ద నిర్మిస్తున్న సీసీ రోడ్డు, గోదావరి రోడ్డు అభివృద్ధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, మంథని మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. మనోహర్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, కౌన్సిలర్లు మారుపాక నిహారిక, నాగరాజు, పెంటరి రాజు, ఎల్లెంకి వంశీధర్, నాయకులు జంబోజు సమ్మయ్య, ఇరిగేషన్ ఏఈ ప్రవీణ్, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి, వారసత్వాన్ని భావితరాలకు అందించాలి

● ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో





ఏటూరునాగారం నవంబర్ 15 ప్రజావాణి:భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి, జనజాతీయ గౌరవ దివస్ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలోని గిరిజన బాలుర క్రీడా పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ హర్సన్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై గిరిజన వీరుల త్యాగాలు, పోరాటాలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులు విద్యతో పాటు తమ మూలాలు, చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాల గురించి కూడా తెలుసుకోవాలని సూచించారు. మన పూర్వీకుల పోరాటాలు, వారు అందించిన స్వాతంత్ర్య స్ఫూర్తి, మన పండుగలు, మాతృభాష, ఆహారపు అలవాట్లు, జీవన విధానంపై ప్రతి విద్యార్థి అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు.

ప్రపంచీకరణ ప్రభావంతో వివిధ సంస్కృతులు కలిసిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మన ప్రత్యేకమైన గిరిజన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని పీఓ పేర్కొన్నారు. విద్యార్థులే సమాజ భవిష్యత్తు అని, తమ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించడంలో వారు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

అదేవిధంగా ప్రస్తుత కాలంలో నిజమైన శక్తి జ్ఞానమేనని, విద్యార్థులు చదువుతో పాటు ప్రశ్నించే తత్వాన్ని, విషయాలను తెలుసుకునే ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. గిరిజన మహనీయుల చరిత్ర, వారి త్యాగాలు, పోరాట స్ఫూర్తిని తెలుసుకొని ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల డిక్లరేషన్ హామీలు అమలు చేయకుంటే సీఎం సభను అడ్డుకుంటాం!

■ ఈ నెల 19లోగా దళితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
■ చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయకుండా సిద్ధిపేట పర్యటనను సహించేది లేదు
■ ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి రాజేందర్ మాదిగ హెచ్చరిక



ప్రజావాణి,నంగునూరు, నవంబరు 15: దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఈ నెల 19న సిద్ధిపేటకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను సహించేది లేదని ఎమ్మార్పీఎస్ టీఎస్ సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి రాజేందర్ మాదిగ హెచ్చరించారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ముఖ్యమంత్రి పాల్గొనే సభను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఆదివారం నంగునూరు మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేడి పాపన్న, రాష్ట్ర అధ్యక్షుడు కె.దాసి మోహన్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వాన్ని దళితుల తరపున సూటిగా ప్రశ్నిస్తున్నామని తెలిపారు.

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దళితులకు అనేక హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. చేవెళ్ల డిక్లరేషన్, ముఖ్యమంత్రి ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సంక్షేమ పథకాలు ప్రకటనలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. హామీలు క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత బంధు పథకానికి బదులుగా ప్రకటించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అభయహస్తం పథకం ద్వారా అర్హులైన దళిత కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దళితులను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరగాలంటే సంక్షేమ పథకాలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి సిద్ధిపేట పర్యటనకు ముందే హామీల అమలుపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సీఎం సభను అడ్డుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దేవులపల్లి నాగరాజు, మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగాల నరసింహులు, మండల అధికార ప్రతినిధి దేవులపల్లి కృష్ణ, మండల సీనియర్ నాయకులు దేవులపల్లి భూమయ్య, దేవులపల్లి కనకయ్య, డి. అజిత్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రజా ప్రభుత్వం: ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

● చెన్నారావుపేట మండలంలో 691 మందికి కొత్త చేయూత పెన్షన్ల పంపిణీ
● మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే దొంతి





చెన్నారావుపేట నవంబర్ 15 ప్రజావాణి అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం చెన్నారావుపేట మండల కేంద్రంలో సూతసంగా మంజూరైన చేయూత పెన్షన్ల ప్రొసీడింగ్ కాపీల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మండలంలోని 30 గ్రామ పంచాయతీలకు చెందిన 691 మంది లబ్ధిదారులకు నూతన పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత పాలనలో పెన్షన్ల కోసం పేదలు ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేదని, కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులందరికీ న్యాయం చేస్తోందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి పైరవీలకు తావులేకుండా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరిగిందని తెలిపారు. మండలంలో మొత్తం 691 కొత్త పెన్షన్లు మంజూరు కాగా, అందులో వితంతువులు 394 మంది, దివ్యాంగులు 165 మంది, గీత కార్మికులు 67 మంది, ఒంటరి మహిళలు 64 మంది, చేనేత కార్మికులు ఒకరు ఉన్నారు. గ్రామాల వారీగా అత్యధికంగా చెన్నారావుపేట పంచాయతీలో 78, పాపయ్యపేటలో 69, ఉప్పరపల్లిలో 63, తిమ్మరాయినిపహాడ్‌లో 52, లింగగిరిలో 51, జల్లిలో 50 చొప్పున పెన్షన్లు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులే దేశ భవిష్యత్తు.. వారి విద్యకు పెద్దపీట వేయా

● అక్కల్ చెడ లో ఘనంగా నెహ్రూ జయంతి, బాలల దినోత్సవ వేడుకలు
● బాలల గ్రామసభలో పాల్గొన్న సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్





చెన్నారావుపేట నవంబర్ 15 ప్రజావాణి మండలంలోని అక్కల్ చెడ గ్రామంలో ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం, ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా బాలల గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలంటే అమితమైన ప్రేమ చూపిన నెహ్రూను చిన్నారులు చాచా నెహ్రూ అని ఆప్యాయంగా పిలుచుకునేవారని గుర్తుచేశారు. బాలలే రేపటి పౌరులని, వారి భవిష్యత్తుకు నాణ్యమైన విద్య పునాది అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యార్థులకు యూనిఫాంలు, బైలు, బెల్టులు, షూస్ అందిస్తూ విద్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రీ ప్రైమరీ విద్య, నూతన విద్యా విధానంతో విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలను పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరన్న, ఉపసర్పంచ్ కక్కెర్ల రజిత శ్రీను, ఉపాధ్యాయులు సురేందర్, సత్య, పూర్ణిమ, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిశెరు రాజేందర్, బోసగిరి సారయ్య, లావుడ్యా వెంకన్న, ముత్యం భద్రయ్య, బోడ వీరు, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు కవిత, సరిత, స్వరూప, ఆశా కార్యకర్తలు రేణుక, చీనమ్మ, నర్సయ్య, కొమురయ్య, పంచాయతీ సిబ్బంది కరెడ్ల రాజు, కొమ్మాలు, ఎల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
గురువారం , సెప్టెంబర్, 03, 2026
తెలుగు దైనిక
మంగళవారం 17
నవంబర్ 2026

ఏటూరునాగారంలో కోర్టు సాధనకు అఖిలపక్షం పోరుబాట!

- వెంకటాపురంలో కోర్టు సాధన కమిటీ అధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం
- సత్వర న్యాయం కోసం అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు ఏకం కావాలని పిలుపు
- ఏజెన్సీ ప్రజల 150 కిలోమీటర్ల ప్రయాణ కష్టాలకు తెరదించాలని డిమాండ్



వెంకటాపురం (నూగురు), నవంబరు 15 (ప్రజావాణి): ములుగు జిల్లాలోని ఏటూరునాగారం కేంద్రంగా జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును ఏర్పాటు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో అఖిలపక్ష నాయకులు, ప్రజాసంఘాలు ఏకతాటిపైకి వచ్చాయి. ఆదివారం మధ్యాహ్నం వెంకటాపురం మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏటూరునాగారం కోర్టు సాధన కమిటీ నిర్వహణలో 'అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశం' అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

న్యాయం కోసం ఏజెన్సీ ప్రజల అవస్థలు..

ఈ సమావేశంలో వలు రాజకీయ పార్టీల నాయకులు, న్యాయవాదులు, ఆదివాసి సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. ఏజెన్సీలోని ఆరు మండలాల ప్రజలు చిన్నచిన్న కేసుల వాయిదాల కోసం 130 నుంచి 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న ములుగు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి రావడం పెనుభారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నూతన న్యాయస్థానాన్ని ఏటూరునాగారంలోనే ఏర్పాటు చేస్తే నిరుపేద గిరిజనులు, రైతులకు సత్వర న్యాయం అందుతుందని స్పష్టం చేశారు. కోర్టు సాధన కోసం పార్టీలకతీతంగా ఐక్య ఉద్యమాలు నిర్మించాలని, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.

మోత్కూపల్లి ని పరామర్శించిన డా బొజ్జ యాదగిరి



మల్కాజిగిరి ప్రతినిధి ప్రజావాణి నవంబర్ 15) ఇటీవల అనారోగ్యానికి గురైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రివర్యులు, మాదిగ మహాశక్తి వ్యవస్థాపక అధ్యక్షులు, మాదిగల పెద్దన్న, మోత్కపల్లి నరసింహులును దళిత జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బొజ్జ యాదగిరి ఆదివారం మర్యాదపూర్వకంగా వారి నివాసంలో కలిసి పరామర్శించారు దళిత జన సమితి మరియు దళిత రత్న అవార్డు గ్రహీత బొజ్జ, యాదగిరి, వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు, అలాగే సమాజంలో మన మాదిగ జాతికి జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేయాలని, హక్కుల కోసం పోరాటం చేయాలని, అలాగే సమాజంలో ఇంకా కులవ్యవస్థత మాదిగలపై ఉన్నదని ఆ కుల వీక్షత నుంచి మన మాదిగ జాతి బిడ్డలకు విముక్తి వచ్చేవరకు మనం పోరాటం చేయాలని, ఏ ప్రభుత్వం వచ్చినా మన మాదిగ జాతికి పెద్దపీట వేసి మాదిగలను అత్యున్నత స్థానంలో ఉంచాలని వారు చర్చించుకోవడం జరిగింది, రాబోయే రోజుల లో తప్పకుండా మాదిగ హక్కుల కోసం మాదిగ జాతి బిడ్డలు పోరాటానికి ఎల్లప్పుడు మన మాదిగ జాతి బిడ్డలు పోరాటానికి సిద్ధంగా ఉంటారని తెలియజేయడం జరిగింది, ఈ యొక్క ముఖ్య కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తెలంగాణ స్టేట్ వ్యవస్థాపక, అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ , మరియు, తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి,వ్యవస్థాపక అధ్యక్షులు ఇటుక రాజ్ మాదిగ,దళిత జన సమితి నాయకులు, ఇప్పల, యాదగిరి గారు, దళిత జన సమితి బిసి నాయకులు కుమార్ గౌడ్, తదితరులు పాల్గొనడం జరిగింది.

ప్రజల గుమ్మాలకే సంక్షేమ పథకాలు...!

- రాష్ట్ర రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి

పేదవాళ్ల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రజల గడపకు చేర్చడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ తో కలిసి తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామంలో కొత్త చేయూత పింఛను మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గతంలో తమ భర్తలు మరణించి సంవత్సరాలు గడుస్తున్నా ఆసరా పింఛన్ వస్తుందని ఎంతో ఎదురుచూశారని కానీ అప్పటి ప్రభుత్వం ఇవ్వలేదని, ప్రజా ప్రభుత్వం లో అర్హులందరికీ చేయూత పింఛనులు అందిస్తున్నామని తెలిపారు. ఈనాడు రాష్ట్రంలో ఎవరిని కదిపినా ప్రజా ప్రభుత్వం పేదోళ్ళ పక్షాన నిలుస్తుందని అంటున్నారని అన్నారు.పేదవాడి ఆత్మగౌరవానికి భంగం కలగకుండా ఇళ్లు ఇవ్వాలనే సదుద్దేశంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందని మంత్రి తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుల పేరుతో గతంలో వేల కోట్లు ఖర్చు పెట్టారే తప్ప పేదవారికి ఇళ్ల నిర్మాణం పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి విడతలో 4.5 లక్షలు, రెండవ విడతలో 2.5 లక్షల ఇళ్లతో పాటు హైదరాబాద్ నగరంలో మరో లక్ష, వెరసి 8 లక్షల



ఇందిరమ్మ ఇళ్లు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 45,000 కోట్ల రూపాయలతో పేదింటి ఆడబిడ్డల కోసం ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టి చూపిస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల ఫైనల్ బిల్లులను కూడా ఏ ఒక్క రూపాయి లంచం లేకుండా నేలాఖరులోపు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని మంత్రి తెలిపారు. రైతును రాజును చేస్తామన్న మాట ప్రకారం రెండు లక్షల రూపాయల రుణమాఫీని విజయవంతంగా అమలు చేశామని, ఎకరాకు రెండు విడతల్లో రూ.12 వేల రైతు భరోసాతో పాటు సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదేనని మంత్రి అన్నారు.

నిరుపేదలకు ఆసరా పింఛన్లు, పేదల వైద్యం, వితంతువులు, వికలాంగులు, వివిధ వ్యాధులతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు పూర్తి భద్రత కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల కొత్త ఆసరా పింఛన్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఎలాంటి కుల, మత భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు.



వైద్య రంగానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ తిరుమలాయపాలెంలో సుమారు రూ.26.5 కోట్లతో 100 బెడ్ల ఆసుపత్రిని, రూ.46 కోట్లతో ఐటీఐ కాలేజీని నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అభివృద్ధి, మౌళిక వసతుల కల్పనలో భాగంగా సిమెంట్ రోడ్ల నిర్మాణం, ఇండ్ల మీద వెళుతున్న విద్యుత్ వైర్ల మార్పు కోసం సుమారు రూ.10 కోట్లు వెచ్చించి షిఫ్టింగ్ పనులు చేపట్టామని తెలిపారు. ఎక్కడా సంక్షేమానికి, అభివృద్ధికి విఘాతం కలగకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ ముందుకు దూసుకుపోతోందని మంత్రి అన్నారు.

ఈ కార్యక్రమంలో హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, తిరుమలాయపాలెం మండలం ఎంపిడివో సిలార్ సాహెబ్, తహసీల్దార్ లూథన్ విల్సన్, ప్రజాప్రతినిధులు, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తిరుమల మిలీనియం అపార్ట్‌మెంట్స్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

- ముఖ్య అతిథిగా పాల్గొన్న వీవీజ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్





మల్కాజిగిరి ప్రతినిధి ప్రజావాణి నవంబర్ 15) మల్లాపూర్ డివిజన్‌లోని తిరుమల మిలీనియం అపార్ట్‌మెంట్స్ ఫేజ్-3లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన "GYANVERSE QUIZ SHOWμ' కార్యక్రమంలో వీవీజ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ, చిన్నారులే దేశ భవిష్యత్తు అని, ప్రతి విద్యార్థి చదువుతో పాటు తనలోని ప్రతిభను వెలికితీసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. గెలుపోటముల కంటే నేర్చుకోవడం ముఖ్యమని, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవిస్తూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో తిరుమల మిలీనియం అపార్ట్‌మెంట్స్ ఫేజ్-3 డి-బ్లాక్ అధ్యక్షులు మల్లికార్జున్, ఈ-బ్లాక్ అధ్యక్షులు శ్రీ నాగేశ్వరరావు జగన్నాథ్, దీప్తి సంతోష్, కె. వెంకటేష్, అబ్దుల్ ఖాలిద్,పి. సంతోష్, సి. అనుదీప్, సాయి రవి రవి కిరణ్, వీరాంజన్, వైభవ్ కేస్కర్, అలాగే బద్మాష్ పొట్టే రిటర్న్స్ సినిమా బృందం సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

- రాంపూర్‌లో వీవో భవనాల ప్రారంభం.. రెండు గోదాంలకు శంకుస్థాపన.. పలు మండలాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం.. 350 మందికి చేయూత పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ

నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో, నవంబర్ 15:--గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్నామని ముధోల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం నర్సాపూర్ (జి), లక్ష్మణచాంద, దిలావర్‌పూర్ మండలాల్లో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు నూతన నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. అర్హులైన లబ్ధిదారులకు చేయూత పింఛన్ల మంజూరు ఉత్తర్వులను అందజేశారు.

నర్సాపూర్ (జి) మండలంలోని రాంపూర్ గ్రామంలో వీవో భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించే దిశగా రెండు గోదాంల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి ప్రవీణ్, ఉపసర్పంచ్ కమ్రుద్దీన్, ఏపీఎం గంగామణి పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో అదనపు గదులు, అంగన్వాడీ భవనం, వీవో భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. గత ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి టాపర్లుగా నిలిచిన కేజీబీవీ విద్యార్థినులు కావేరి, కీర్తనలను ఘనంగా సన్మానించి అభినందించారు. విద్యార్థులు



కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అదే విధంగా మండలంలోని అర్హులైన లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల ఉత్తర్వు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇంద్రకరణ్ రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో పుష్పలత, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఎస్ఓ వీణ, బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్, నాయకులు రాజేందర్, సుధాకర్, విజయ్, గంగారాం పాల్గొన్నారు.

లక్ష్మణచాంద మండలంలోని రాచాపూర్ గ్రామంలో నిర్మించిన వర్క్‌షెడ్ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో నూతనంగా మంజూరైన 350 చేయూత పింఛన్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను లబ్ధిదారులకు అందజేశారు. మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడేలా రాచాపూర్‌లో నిర్మించిన రెండు ఐకేపీ మహిళా వర్క్‌షెడ్ భవనాలతో పాటు అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో వనజ, ఎంపీఓ నసీరుద్దీన్, ఓటీ బాబుసింగ్, సర్పంచులు ఓస కవిత రాజు, ముత్యం తదితరులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి నూతన చేయూత పింఛన్ల మంజూరు ఉత్తర్వు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పింఛన్లతో అర్హులైన పేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, మండల అధ్యక్షుడు నర్సారెడ్డి, సర్పంచులు రోజా, రమ్య, చందు, శంకర్ రెడ్డి, శ్రీలత సాయన్న, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే మహాసభలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

నిర్మల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 25న నిర్వహించనున్న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా మహాసభలకు హాజరుకావాలని కోరుతూ శనివారం సంఘం నాయకులు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అలాగే మాజీ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్‌ను కలిసి మహాసభలకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్స్ సేవా కార్యక్రమాలు అభినందనీయం -- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



మల్కాజిగిరి ప్రతినిధి (ప్రజావాణి నవంబర్ 15) కార్ఖానాలోని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ రీజియన్ కాన్ఫరెన్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ మాట్లాడుతూ, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ సంస్థ సమాజ సేవలో అందిస్తున్న సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. దేవాలయాల నుంచి విద్యాసంస్థల వరకు వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, సమాజ అభ్యున్నతికి తమ వంతు కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. సేవా భావంతో ముందుకు సాగుతున్న వాసవి క్లబ్ సభ్యులను, వైశ్య సంఘ నాయకులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ రీజియన్ చైర్మన్, సెక్రటరీ మంచి కంటి జోత్స్న, నాగేశ్వరరావు, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ సభ్యులు, వైశ్య కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఉచిత శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

- డా.కాయితి శంకర్ డిఎమ్ డబ్ల్యూజెఫ రాష్ట్ర జనరల్ సెక్రటరీ



రాయికల్: నవంబర్ 15(ప్రజావాణి) వచ్చే నెల 12,13 తేదీలలో జగిత్యాల జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో కోకిల జర్నలిజం స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విలేకరుల వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని డిఎమ్ డబ్ల్యూజెఏ రాష్ట్ర జనరల్ సెక్రటరి డాక్టర్ కాయితి శంకర్ ఆదివారం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో విలేకరుల వృత్తి నైపుణ్యం టెక్నాలజీ కి అనుగుణంగా ఎప్పటికప్పుడు విలేకరులు నైపుణ్యం మరియు చట్టాలపై అవగాహన, సామాజిక న్యాయం గురించి అవగాహన డిజిటల్ మీడియా లో మెలుకువలు మెరుగైన శిక్షణ అందించేందుకు ఈ శిక్షణ తరగతులు విలేకరులకు ఉపయోగపడుతుందని తెలిపారు ఈ శిక్షణ తరగతులను యువ విలేకరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు శిక్షణ తరగతులలో పాల్గొన్న వారికి కోకిల జర్నలిజం స్కూల్ సర్టిఫికెట్ అందించిబడుతుందని తెలిపారు.దరఖాస్తులు చేసుకునేవారు 9491322556 నెంబర్ కు వివరాలు పంపించాలని కోరారు.

రాయసముద్రం చెరువు వద్ద ఛట్ పూజలు

- ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆదర్శ్ రెడ్డి



రామచంద్రాపురం, నవంబర్ 15 (ప్రజావాణి): రామచంద్రాపురం పరిధిలోని రాయసముద్రం చెరువు వద్ద నిర్వహించిన ఛట్ పూజ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఛట్ పూజ పండుగ విశిష్టతను ప్రస్తావిస్తూ, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్న భక్తులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, పరమేష్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, అప్పల భాస్కర్, సంజయ్ సింగ్, సన్నీ, రాజ్ కుమార్, అమిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 691 మందికి పింఛన్ల లబ్ధి

- వితంతువుల విభాగంలో అత్యధికంగా 394 మందికి..
- దివ్యాంగులకు 165, గీత కార్మికులకు 67 పింఛన్లు
- చెన్నారావుపేటలో అత్యధికంగా 78 మంది లబ్ధిదారులు

చెన్నారావుపేట నవంబర్ 15 ప్రజావాణి మండల పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీలలో మొత్తం 691 మంది అర్హులకు పింఛన్లు అందుతున్నాయి. మండలంలోని 30 పంచాయతీల వారీగా లబ్ధిదారుల జాబితాను అధికారులు వెల్లడించారు. మండల వ్యాప్తంగా వితంతువుల విభాగంలో అత్యధికంగా 394 మంది పింఛన్ పొందుతున్నారు. ఆ తర్వాత దివ్యాంగులు 165 మంది, గీత కార్మికులు 67 మంది, ఒంటరి మహిళలు 61 మంది, ఇతర విభాగంలో ముగ్గురు (3), నేత కార్మికుల విభాగంలో ఒకరు లబ్ధి పొందుతున్నారు.మండల కేంద్రమైన చెన్నారావుపేటలో అత్యధికంగా 78 మంది (వితంతువులు 48, దివ్యాంగులు 26, గీత కార్మికులు 3, ఒంటరి మహిళ 01) ఉన్నారు. పాపయ్యపేటలో 69, ఉప్పరపల్లి లో 63, తిమ్మరాయినిపహాడ్‌లో 52, లింగగిరిలో 51, జల్లిలో 50 మంది పింఛన్లు అందుకుంటున్నారు.

15 నుంచి 35 మంది ఉన్న గ్రామాలు..

ఎల్లయ్యగూడెంలో 32, లింగపురంలో 30, అమీనాబాద్, కోనాపురంలో 29 చొప్పున, పత్తి నాయక్ తండాలో 22, అక్కల్ చెడలో 20, బోజెర్వులో 19, ఖాదర్‌పేటలో 16, కాల్ నాయక్ తండాలో 15 మందికి పింఛన్లు అందుతున్నాయి.

15 మంది లోపు ఉన్న గ్రామాలు..

జీడిగడ్డ తండాలో 12, బొడమాణిక్యం తండా, శంకరం తండా, సూర్యాపేట తండాల్లో 10 చొప్పున, అమ్రు తండా, బాపునగర్, కందిగడ్డ తండాల్లో 9 చొప్పున, చెరువుకొమ్ము తండా, జోజిపేట నారాయణ తండాల్లో 8 చొప్పున లబ్ధిదారులు ఉన్నారు. 16-చింతల తండా, ధర్మ తండా, పుల్లాయిబోడు తండాల్లో 6 చొప్పున, గొల్లభామ తండాలో 5, గొల్లపల్లె, తోపనగడ్డ తండాల్లో అత్యల్పంగా 4గురు చొప్పున పింఛన్లు పొందుతున్నారు.

ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
గురువారం . సెప్టెంబర్ 03, 2026
మంగళవారం 17
నవంబర్ 2026

బిజినెస్

భారత్ ఏఐ పాలసీ భేష్.. యూరప్‌లా కఠినంగా లేదు


ఐబీఎం సీఈఓ అరవింద్ కృష్ణ

ప్రపంచ ఏఐ రంగంలో భారత్ మరింత కీలక పాత్ర పోషించగలదన్న అరవింద్ కృష్ణ

యూరప్‌లా కాకుండా అతి నియంత్రణకు దూరంగా ఉండటం మంచి నిర్ణయమని వెల్లడి

ఏఐలో ప్రభుత్వం విజేతలను ఎంపిక చేసే విధానం ప్రమాదకరమని వ్యాఖ్య

భారత్‌ను గొప్ప మార్కెట్‌గా, ఉత్పత్తి కేంద్రంగా చూస్తున్న ఐబీఎం



ప్రపంచ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో ప్రస్తుతం ఉన్న దానికంటే భారత్ చాలా పెద్ద పాత్ర పోషించే సత్తా ఉందని, ఇందుకు పటిష్ఠమైన ప్రభుత్వ విధానాలు దోహదపడతాయని ఐబీఎం చైర్మన్, సీఈఓ అరవింద్ కృష్ణ అన్నారు. తాజాగా ఆయన ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐ విషయంలో భారత ప్రభుత్వ విధానాన్ని ఆయన ప్రశంసించారు. యూరప్‌లో మాదిరిగా అతిగా నియంత్రణ విధించకుండా, ఆవిష్కరణలకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం జాగ్రత్త పడుతోందని అరవింద్ కృష్ణ అభిప్రాయపడ్డారు. యూరప్‌లో కఠిన నిబంధనల వల్ల ఏఐ ఎకోసిస్టమ్ దాదాపుగా లేకుండా పోయిందని ఆయన గుర్తుచేశారు. ఆధార్, డిజిటల్ పేమెంట్లు, క్విక్ కామర్స్ వంటి రంగాల్లో భారత్ అద్భుతమైన విజయం సాధించిందని, కానీ ఏఐ విషయంలో తన స్థానం ఏమిటో ఇంకా స్పష్టంగా నిర్ధారించుకోవాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. దేశీయంగా తయారైన ఏఐని ప్రోత్సహించడానికి, వివిధ ప్రభుత్వ ప్రయోజనాల కోసం దాన్ని ఉపయోగించుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. అదే సమయంలో ప్రభుత్వమే పారిశ్రామిక విధానాలను నిర్దేశిస్తూ, ఏ సంస్థలు విజయం సాధించాలో నిర్ణయించడం ప్రమాదకరమైన పోకడ అని ఆయన హెచ్చరించారు. చాలా మంది ఇలాంటి విధానాలను కోరుకున్నప్పటికీ, ప్రభుత్వం అలా విజేతలను ఎంపిక చేయడం మంచిది కాదని స్పష్టం చేశారు. ఐబీఎంకు ప్రపంచవ్యాప్తంగా భారత్ ఒక కీలకమైన భాగస్వామి అని అరవింద్ కృష్ణ తెలిపారు. "భారత్ ఒక గొప్ప మార్కెట్. ఉత్పత్తులను తయారు చేయడానికి, ప్రపంచవ్యాప్తంగా ఐబీఎంకు సేవలు అందించే ఉద్యోగులను కలిగి ఉండటానికి ఇది ఒక అద్భుతమైన ప్రదేశం" అని ఆయన వివరించారు. ఇప్పటికే భారత ప్రభుత్వం 'ఇండియా ఏఐ గవర్నెన్స్ గైడ్‌లైన్స్' పేరుతో మార్గదర్శకాలను విడుదల చేసింది. బాధ్యతాయుతమైన ఏఐ ఆవిష్కరణలే లక్ష్యంగా ఈ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించింది. డీప్‌ఫేక్‌లు, తప్పుడు సమాచారం, అల్గారిథమిక్ బయాస్ వంటి ప్రమాదాలను నివారించడం దీని ఉద్దేశం. ఈ మార్గదర్శకాల ప్రకారం, ఏఐ గవర్నెన్స్ గ్రూప్, టెక్నాలజీ అండ్ పాలసీ ఎక్స్‌పర్ట్ కమిటీ, ఏఐ సేఫ్టీ ఇన్‌స్టిట్యూట్‌లను ఏర్పాటు చేయాలని కూడా ప్రతిపాదించారు.

హిడెన్ సాఫ్ట్‌వేర్ ఎర్రర్, సర్వర్లపై విపరీతమైన ఒత్తిడి
మైక్రోసాఫ్ట్ సర్వర్ల డౌన్‌కు కారణాలు ఇవే!

ఇటీవల ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ 365 సేవలు భారీగా స్తంభించిపోవడానికి గల కారణాలను టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ అధికారికంగా వెల్లడించింది. నెట్‌వర్కింగ్ వ్యవస్థలోని ఒక అంతర్గత సాఫ్ట్‌వేర్ లోపం (హిడెన్ సాఫ్ట్‌వేర్ ఫ్లా), సర్వర్లపై ఒక్కసారిగా పెరిగిన భారీ ట్రాఫిక్ మరియు సర్వర్ల సామర్థ్యం తగ్గడం.. ఈ మూడు ప్రధాన అంశాల కలయిక వల్లే ఈ తీవ్ర అంతరాయం ఏర్పడిందని సంస్థ స్పష్టం చేసింది. నవంబర్ 12న చోటుచేసుకున్న ఈ సాంకేతిక సమస్య కారణంగా ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ టీమ్స్, వన్‌డ్రైవ్, షేర్‌పాయింట్, ఆఫీస్ అప్లికేషన్ల సేవలకు తీవ్ర విఘాతం కలిగింది. ఈ పరిణామంపై మైక్రోసాఫ్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సోషల్ మీడియా వేదికగా వినియోగదారులకు క్షమాపణలు చెబుతూ ప్రాథమిక విచారణ వివరాలను పంచుకున్నారు.

మైక్రోసాఫ్ట్ తెలిపిన వివరాల ప్రకారం.. మైక్రోసాఫ్ట్ 365 సర్వీసులను అనుసంధానించే ఫ్రంట్-ఎండ్ నెట్‌వర్కింగ్ వ్యవస్థలో ఈ సమస్య మొదలైంది. ఒక నిర్దిష్ట పరిస్థితిలో సర్వర్లు ఓవర్‌లోడ్ అయి స్పందించకుండా పోవడానికి అక్కడ దాగివున్న సాఫ్ట్‌వేర్ లోపం కారణమైంది. వాస్తవానికి ఈ కోడ్‌ను మార్పును జూలై నెలలోనే ప్రవేశపెట్టారు. దాదాపు మూడు నెలల పాటు ఇది ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేసింది. సాధారణ టెస్టింగ్ ప్రక్రియలో ఉపయోగించిన హార్డ్‌వేర్, ట్రాఫిక్ పద్ధతులు రియల్-వరల్డ్ వ్యవస్థలకు భిన్నంగా ఉండటం వల్ల ఈ లోపం ముందే బయటపడలేదు.

అయితే, సర్వీసుల అంతరాయానికి సుమారు 15 గంటల ముందు టీమ్స్ ట్రాఫిక్‌ను బ్యాకప్ వ్యవస్థ నుంచి ప్రధాన వ్యవస్థకు మార్చడంతో నెట్‌వర్క్‌పై ఒక్కసారిగా రద్దీ పెరిగింది. దీనికితోడు అంతకుముందు రోజు ఎదురైన మరో సాంకేతిక సమస్య వల్ల దాదాపు 14 శాతం సర్వర్ల సామర్థ్యం



అందుబాటులో లేకుండా పోయింది. ఈ కారణాలు ఒక్కటైనా పెద్దగా ప్రభావం చూపేవి కావు కానీ, రెండూ ఒకేసారి తోడవడంతో దాగివున్న సాఫ్ట్‌వేర్ లోపం తీవ్రరూపం దాల్చింది. అమెరికా పీక్ ట్రాఫిక్ వేళ విపరీతంగా రిక్వెస్టులు పేరుకుపోయి సర్వర్లు స్తంభించిపోయాయి. పరిస్థితి విషమించిన సమయంలో ఏకంగా 80 శాతానికి పైగా సర్వర్లు స్పందించడం మానేశాయి. వినియోగదారులను ఇతర సర్వర్లకు మళ్లించేందుకు ఆటోమేటిక్ వ్యవస్థలు ప్రయత్నించినప్పటికీ, అదనపు లోడ్ కారణంగా అవి కూడా మొరాయించి చైన్ రియాక్షన్ ఏర్పడింది. సమస్యను ఒకే ప్రాంతానికి పరిమితం చేసే అంతర్గత భద్రతా వ్యవస్థలు కూడా విఫలమవడంతో సమస్య ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. చివరికి ఇంజనీర్లు లోపభూయిష్టమైన కోడ్‌ను గుర్తించి, సరికొత్త అప్‌డేట్ ద్వారా వ్యవస్థను తిరిగి గాడిన పెట్టారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు, భవిష్యత్ కార్యాచరణతో కూడిన పూర్తి నివేదికను త్వరలోనే విడుదల చేయనున్నట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది.

వాట్సాప్‌లో 'జాప్స్' ఫీచర్..
వాట్సాప్ 'జాప్స్' పేరుతో కొత్త ఫీచర్ అభివృద్ధి

దీని ద్వారా నేరుగా కెమెరాతో తీసిన ఫొటోలు, వీడియోలను పంపే ఛాన్స్

అవతలి వ్యక్తి చూసిన వెంటనే అవి వారి చాట్ నుంచి మాయం

ఇంకా అభివృద్ధి దశలోనే ఉన్న ఈ ఫీచర్

పబ్లిక్ బీటా వెర్షన్‌లోనూ అందుబాటులోకి

వాట్సాప్ వినియోగదారుల కోసం మరో కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చేందుకు మెటా సంస్థ సిద్ధమవుతున్నట్లు సమాచారం. 'జాప్స్' పేరుతో అభివృద్ధి చేస్తున్న ఈ ఫీచర్ ద్వారా ఫొటోలు, చిన్న వీడియోలను వేగంగా పంపుకోవచ్చు. వాటిని అవతలి వ్యక్తి ఒకసారి చూసిన వెంటనే వారి స్క్రీన్ నుంచి మాయమవుతాయి. గతంలో ఈ ఫీచర్‌ను 'ఇన్‌స్టంట్స్' పేరుతో అభివృద్ధి చేయగా.. తాజాగా 'జాప్స్'గా పేరు మార్చినట్లు వాట్సాప్ అప్‌డేట్లను పరిశీలించే వాబీటాఇన్ఫో వెల్లడించింది. ఈ ఫీచర్ కోసం వాట్సాప్‌లో ప్రత్యేక కెమెరా ఇంటర్‌ఫేస్



అందుబాటులోకి రానుంది. అందులో నేరుగా ఫొటో తీయడం లేదా చిన్న వీడియో రికార్డు చేసి పంపడం సాధ్యమవుతుంది. గ్యాలరీలో ఉన్న ఫొటోలు, వీడియోలను అప్‌లోడ్ చేసే అవకాశం ఉండదు. పంపిన జాప్‌ను అవతలి వ్యక్తి చూసిన తర్వాత వారి చాట్‌లో కనిపించదు. అయితే పంపిన వారికి మాత్రం చాట్ హిస్టరీలో అవి కనిపిస్తాయని ప్రాథమిక సమాచారం. ఒకే చాట్‌లో వరుసగా పంపిన జాప్‌లను '2 జాప్స్' వంటి కౌంటర్‌తో ఒకచోట చూపించనున్నారు. సాధారణ వాట్సాప్ సందేశాల మాదిరిగానే వీటికీ 'ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్' రక్షణ ఉంటుంది. జాప్‌లను వ్యక్తిగత కాంటాక్టులతో పాటు గ్రూపులు, పబ్లిక్ ఛానళ్లకు పంపే అవకాశం కూడా ఉండొచ్చని నివేదికలు చెబుతున్నాయి. వాటిని తెరిచినప్పుడు పంపిన వ్యక్తి పేరు కనిపిస్తుంది. ఎమోజీలతో స్పందించడం, టెక్స్ట్ రిప్లై ఇవ్వడం కూడా సాధ్యమవుతుంది. అయితే ఈ ఫీచర్ ఇంకా అభివృద్ధి దశలోనే ఉంది. పబ్లిక్ బీటా వినియోగదారులకు కూడా అందుబాటులోకి రాలేదు. దీనిపై వాట్సాప్ అధికారికంగా స్పందించలేదు.

రోహిత్ శర్మ వన్డే భవిష్యత్తుపై సందిగ్ధం..
చీఫ్ సెలక్టర్ ఓజా ముందు కీలక సవాల్.. జట్టా, స్నేహమా?

న్యూజిలాండ్‌తో నాలుగు వన్డే ఇన్నింగ్స్‌ల్లో 30 పరుగులే చేసిన రోహిత్

ప్రపంచకప్ బెర్త్‌పై సందేహాలు పెంచిన ఆటతీరు

అతడి భవిష్యత్తుపై నిర్ణయం తీసుకోవాల్సిన కొత్త చీఫ్ సెలక్టర్ ప్రజ్ఞాన్ ఓజా

వచ్చే ఏడాది 6 వన్డేలు ఆడనున్న భారత్

స్వదేశంలో పరుగులు చేసినా విదేశీ పరిస్థితుల్లో రాణించగలడా అన్నది కీలకం



టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ భవిష్యత్తుపై ఇప్పుడు ఆసక్తికర చర్చ మొదలైంది. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచకప్‌లో అతడికి చోటు దక్కుతుందా? అన్న ప్రశ్నకు కొత్త చీఫ్ సెలక్టర్ ప్రజ్ఞాన్ ఓజా సమాధానం చెప్పాల్సి ఉంది. న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగు వన్డే ఇన్నింగ్స్‌ల్లో రోహిత్ కేవలం 30 పరుగులే చేయడం ఈ చర్చకు కారణమైంది. ఫామ్ కోల్పోయినప్పటికీ ఆట (కెరీర్) కొనసాగించాలన్న అతడి పట్టుదల.. సెలక్టర్లకు చిక్కుముడిగా మారింది. జూనియర్ క్రికెట్ రోజుల నుంచి రోహిత్, ఓజా మధ్య స్నేహం ఉంది. గతంలో నేషనల్ క్రికెట్ అకాడమీలో జరిగిన శిక్షణ శిబిరాల సమయంలోనూ వారి అనుబంధం బలపడింది. ఇప్పుడు ఓజా సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడంతో రోహిత్ విషయంలో కఠిన నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యక్తిగత అనుబంధాన్ని పక్కనపెట్టి, ఆటగాడి ప్రస్తుత సామర్థ్యం, ప్రపంచకప్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ముందు అప్పటి చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ సూచనతో ఓజా.. రోహిత్‌తో సమావేశమయ్యాడు. లార్డ్స్‌లో జరిగే మ్యాచ్ సందర్భంగా వన్డేలకు వీడ్కోలు పలికేందుకు సిద్ధంగా ఉన్నాడా? అన్నది తెలుసుకోవడమే ఆ భేటీ ఉద్దేశం. అయితే ఆ ప్రతిపాదనపై రోహిత్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. భారత క్రికెట్‌ను నడిపిస్తున్న వారిపై తన అసహనాన్ని కూడా వెల్లడించాడు. ఆ పరిణామాల తర్వాత అగార్కర్-రోహిత్ మధ్య వ్యక్తిగత సంబంధాలు దెబ్బతిన్నాయని వార్తలు వచ్చాయి. ఇప్పుడు అగార్కర్ స్థానంలో వచ్చిన ఓజాకు ఆ బాధ్యత బదిలీ అయింది. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో టాప్ ఆర్డర్ పదేపదే కుప్పకూలడంపై కోచ్ గౌతమ్ గంభీర్ ఆందోళన వ్యక్తం చేశాడు. అయితే భారత్ బౌలర్లు అద్భుతంగా రాణించడంతో సిరీస్‌ను 3-1తో గెలుచుకుంది. రోహిత్ కూడా సీమింగ్, బౌన్స్ ఉన్న పిచ్‌లపై ఇబ్బంది పడ్డాడు. వెస్టిండీస్‌తో స్వదేశంలో రాణించినప్పటికీ, న్యూజిలాండ్‌లో పరిస్థితుల్లో అతడి వైఫల్యాలు కొట్టొచ్చినట్టు కనిపించాయి. బౌన్స్‌ను ఎదుర్కోవడం, పవర్‌ప్లేలో నిలదొక్కుకోవడం అతడికి సవాలుగా మారాయి. కొన్ని సందర్భాల్లో ఆడాలన్న మనసుకు, శరీర స్పందనకు మధ్య సమన్వయం కనిపించడం లేదని విశ్లేషణ పేర్కొంది.

ప్రపంచకప్‌కు ముందు భారత్ స్వదేశంలో మరో 6 వన్డేలు ఆడనుంది. ఆ తర్వాత 6 నెలల విరామం ఉంటుంది. శ్రీలంక, జింబాబ్వేలతో స్వదేశంలో జరిగే మ్యాచ్‌ల్లో రోహిత్ భారీ స్కోర్లు సాధించే అవకాశం ఉందని అంచనా. అయితే స్వదేశంలో పరుగులు చేసినంత మాత్రాన విదేశీ పరిస్థితుల్లోనూ రాణిస్తాడని సెలక్టర్లు భావించకపోవచ్చు. ఐపీఎల్ ఆడే ముందు దాదాపు మూడు నెలల విరామం ఉండటం కూడా అతడి ఫామ్‌పై ప్రభావం చూపుతుందా అన్న సందేహాలున్నాయి. రోహిత్ విజయ్ హజారే ట్రోఫీలో ఆడే అవకాశమూ ఉంది. అయితే దేశవాళీ వన్డే టోర్నీలో పాల్గొనడం కంటే, అక్కడి ప్రదర్శనలో స్థిరత్వం చూపించడం ముఖ్యం. ముఖ్యంగా కఠిన పరిస్థితుల్లో అతడి ఆటతీరును అంచనా వేయాల్సి ఉంటుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా భారత క్రికెట్‌కు సేవలందించిన ఆటగాడికి గౌరవప్రదమైన వీడ్కోలు దక్కాలన్న అందరి ఆశ. అయితే ప్రస్తుతానికి రోహిత్, ఓజా మధ్య బహిరంగంగా, స్పష్టంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచకప్ ప్రణాళికల్లో తన స్థానం ఏంటో రోహిత్‌కు తెలియాలి. అతడి ప్రస్తుత సామర్థ్యం, భవిష్యత్తు ప్రణాళికలపై సెలక్షన్ కమిటీకి కూడా స్పష్టత రావాలి. వచ్చే ఏడాది స్వదేశంలో జరిగే వన్డే సిరీస్‌లో చివరి మ్యాచ్ ముంబైలోని వాంఖడే స్టేడియంలో జింబాబ్వేతో జరగనుంది. రోహిత్ కెరీర్‌లో ఆ మ్యాచ్ కీలక మలుపుగా మారుతుందా? న్యూజిలాండ్ సిరీస్ తర్వాత ఈ ప్రశ్నకు ప్రాధాన్యం పెరిగింది.

స్పోర్ట్స్

రజత్ పటీదార్ విధ్వంసం..

48 బంతుల్లోనే 135 పరుగులు.. రికార్డుల మోత!

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో రజత్ విధ్వంసకర ఇన్నింగ్స్

కేవలం 48 బంతుల్లోనే 13 సిక్సర్లు, 8 ఫోర్లతో 135 పరుగులు

మధ్యప్రదేశ్ తరఫున ఈ టోర్నీలో సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా రికార్డు

శివాంగ్ కుమార్‌తో కలిసి 62 బంతుల్లోనే 153 పరుగుల భారీ భాగస్వామ్యం

గాయాల కారణంగా ఇటీవలే ఇండియా 'ఏ' జట్టు నుంచి తప్పుకున్న పటీదార్



సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మధ్యప్రదేశ్ కెప్టెన్ రజత్ పటీదార్ విధ్వంసకర బ్యాటింగ్‌తో అదరగొట్టాడు. న్యూ చండీగఢ్‌లో అస్సాంతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 48 బంతుల్లోనే అజేయంగా 135 పరుగులు బాదాడు. అతని మెరుపు ఇన్నింగ్స్ ఫలితంగా మధ్యప్రదేశ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 250 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ ఇన్నింగ్స్‌లో రజత్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. మొత్తం 13 సిక్సర్లు, 8 ఫోర్లు బాదాడు. కేవలం 41 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకోవడం విశేషం. దీంతో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ చరిత్రలో మధ్యప్రదేశ్ తరఫున సెంచరీ నమోదు చేసిన తొలి బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. అంతేకాకుండా ఒకే ఇన్నింగ్స్‌లో 13 సిక్సర్లు బాది, రాష్ట్రం తరఫున ఈ టోర్నీలో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాడిగానూ మరో ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. మధ్యప్రదేశ్ జట్టు 8వ ఓవర్లో 57 పరుగులకు 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్నప్పుడు రజత్ క్రీజులోకి వచ్చాడు. ఏమాత్రం సమయం తీసుకోకుండా అస్సాం బౌలర్లపై ఎదురుదాడికి దిగి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. మూడో నంబర్‌లో వచ్చిన శివాంగ్ కుమార్‌తో కలిసి అద్భుతమైన భాగస్వామ్యం నెలకొల్పాడు. వీరిద్దరూ కలిసి కేవలం 62 బంతుల్లోనే 153 పరుగులు జోడించారు. ఇది ఈ టోర్నీలో మధ్యప్రదేశ్‌కు రెండో అత్యధిక భాగస్వామ్యం. తన ఇన్నింగ్స్ మొత్తంలో రజత్ కేవలం ఐదు డాట్ బాల్స్ మాత్రమే ఆడటం అతని దూకుడుకు నిదర్శనం. ఇటీవల గాయాల కారణంగా 50 ఓవర్ల ఫార్మాట్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్న రజత్, ఈ ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. నవంబర్ 19 నుంచి 29 వరకు దోహాలో జరగనున్న రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ కోసం ప్రకటించిన ఇండియా 'ఏ' జట్టుకు తొలుత వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అయితే, ఆ జట్టు నుంచి తాను తప్పుకుంటున్నట్లు బీసీసీఐకి తెలియజేశాడు. ఈ నేపథ్యంలో టీ20 ఫార్మాట్‌లో అతను ఇంతటి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడటం ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
గురువారం . సెప్టెంబర్ 03, 2026
మంగళవారం 17
నవంబర్ 2026



ఆది సాయికుమార్ కొత్త సినిమా.. ఆసక్తిగా టైటిల్

ఆది సాయికుమార్ హీరోగా వస్తోన్న లేటెస్ట్ మూవీ అరుంధతి నక్షత్రం. ఈ చిత్రంలో మేఘు శెట్టి, మధు దామరాజు హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో డైరెక్టర్ రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని 7 పి.ఎం. ప్రొడక్షన్స్, శ్రీ చక్ర మూవీస్ ఎల్ఎల్పీ బ్యానర్స్‌పై సందీప్ అగరం, అష్మిత రెడ్డి బాసాని, డా.సూర్యకాంతి కూచిభొట్ల నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ షూటింగ్ హైదరాబాద్‌లో గ్రాండ్‌గా ప్రారంభమైంది. ఈ మూవీ పూజా కార్యక్రమంలో ముహూర్తపు సన్నివేశానికి నటుడు సాయి కుమార్ క్లాప్ ఇచ్చారు. ప్రొడ్యూసర్స్ రమేష్ పుప్పాల, సూర్యకాంతి కూచిభొట్ల కెమెరా స్విచ్ఛాన్ చేశారు. చిత్ర నిర్మాతలు స్క్రిప్ట్ అందించారు. ఈ మూవీ ఆది సాయికుమార్ కెరీర్‌లో 28వ సినిమాగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా అనౌన్స్ మెంట్ స్పెషల్ వీడియో గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ వీడియో చూస్తుంటే ఒక మంచి రూరల్ ఫ్యామిలీ డ్రామా అని అర్థమవుతోంది. ఈ నెలలోనే అరుంధతి నక్షత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి సురేశ్ బొబ్బిలి సంగీతమందిస్తున్నారు.

రామాయణం బాక్సాఫీస్ సునామీ.. సెకండ్ సండే రూ.75 కోట్ల వసూళ్లు ధురంధర్ 2 రికార్డు బద్దలు!



బాక్సాఫీస్ వద్ద 'రామాయణం పార్ట్ 1' ప్రభంజనం కొనసాగుతోంది. భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ విజువల్ వండర్ కలెక్షన్ల విషయంలో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, నేచురల్ బ్యూటీ సాయి పల్లవి సీతాదేవిగా, రాకింగ్ స్టార్ యశ్ రావణుడిగా నటించిన ఈ చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. దీపావళి పండుగ సందర్భంగా విడుదలైన ఈ సినిమా మొదటి వారంలోనే భారీ వసూళ్లు సాధించగా, రెండో వారాంతంలోనూ అదే జోరును కొనసాగించింది. ముఖ్యంగా రెండో ఆదివారం నమోదైన కలెక్షన్లు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ క్రమంలోనే 'ధురంధర్ 2' పేరిట ఉన్న సెకండ్ సండే రికార్డును కూడా రామాయణం అధిగమించినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. 'రామాయణం' సినిమా రెండో వారాంతంలోనూ బాక్సాఫీస్ వద్ద తన ఆధిపత్యాన్ని చాటుకుంది. నవంబర్ 15, ఆదివారం ఈ చిత్రం భారతదేశంలో సుమారు రూ.75 కోట్ల నెట్ వసూళ్లు సాధించినట్లు సాక్నిల్క్ గణాంకాలు వెల్లడించాయి. అంతకుముందు శనివారం నమోదైన రూ.72.90 కోట్లతో పోలిస్తే ఆదివారం కలెక్షన్లు మరింత పెరగడం విశేషం. సాధారణంగా సినిమాలకు మొదటి వారాంతం తర్వాత వసూళ్లు తగ్గుతుంటాయి. కానీ 'రామాయణం' విషయంలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. రెండో ఆదివారం కూడా ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో థియేటర్లకు రావడంతో ఈ సినిమా మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. రెండో ఆదివారం అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల జాబితాలో 'రామాయణం' సరికొత్త రికార్డును నమోదు చేసింది. ఇప్పటివరకు ఈ విషయంలో 'ధురంధర్ 2' సాధించిన రూ.68 కోట్ల వసూళ్లు రికార్డుగా ఉన్నాయి. అయితే రామాయణం రెండో ఆదివారం రూ.75 కోట్లు సాధించినట్లు వచ్చిన గణాంకాలతో ఆ రికార్డు బద్దలైంది. దీంతో రెండో ఆదివారం అత్యధిక కలెక్షన్లు సాధించిన సినిమాల జాబితాలో రామాయణం అగ్రస్థానానికి చేరినట్లు ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా రెండో వారంలోనూ కలెక్షన్లు పెరుగుతుండటం ఈ సినిమా బాక్సాఫీస్ బలాన్ని తెలియజేస్తోంది. 'రామాయణం' సినిమా వసూళ్ల జోరు ఇతర భారీ చిత్రాల లైఫ్‌టైమ్ కలెక్షన్లపై కూడా ప్రభావం చూపిస్తోంది. ఇప్పటివరకు ఈ చిత్రం భారత్‌లో సుమారు రూ.760.60 కోట్ల నెట్ వసూళ్లు సాధించినట్లు సాక్నిల్క్ గణాంకాలు వెల్లడించాయి. ఈ క్రమంలో షారుఖ్ ఖాన్ నటించిన 'జవాన్' రూ.643.87 కోట్ల లైఫ్‌టైమ్ నెట్ కలెక్షన్లను అధిగమించింది. అలాగే రాజ్‌కుమార్ రావ్ నటించిన 'స్త్రీ 2' రూ.625.27 కోట్లు, విక్కీ కౌశల్ 'ఛావా' రూ.601.57 కోట్లు, షారుఖ్ ఖాన్ 'పఠాన్' రూ.544.28 కోట్లు, రణ్‌బీర్ కపూర్ 'యానిమల్' రూ.556.36 కోట్ల వసూళ్లను కూడా దాటేసినట్లు సమాచారం. ఒకే సినిమాతో ఇన్ని భారీ చిత్రాల రికార్డులను అధిగమించడం ఇప్పుడు బాలీవుడ్‌లో పెద్ద చర్చగా మారింది.

తేజ సజ్జా నిశ్చితార్థం.. తెలంగాణ గవర్నర్ స్పెషల్ విషెస్



టాలీవుడ్ యువ హీరో తేజ సజ్జా త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నారు. ఆయన నిశ్చితార్థ వేడుక హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ తాజ్ కృష్ణ హోటల్‌లో ఘనంగా జరిగింది. ఇప్పటికే పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఈ వేడుకకు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. తాజాగా తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా సైతం ఈ వేడుకకు విచ్చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా కాబోయే దంపతులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. వారి వైవాహిక జీవితం ప్రేమ, సంతోషం, సామరస్యంతో నిండాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు నెట్టింట సందడి చేస్తున్నాయి.



ఆకాశంలో ఓ తార ట్రైలర్ విడుదల.. అమ్మాయి కలకు అండగా దుల్కర్ సల్మాన్..!

మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ తెలుగు ప్రేక్షకులకు కూడా ఎంతో చేరువయ్యారు. ఆయన నటించే సినిమాలకు తెలుగులోనూ మంచి ఆదరణ లభిస్తోంది. ఈ క్రమంలో ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా తెలుగు చిత్రం 'ఆకాశంలో ఓ తార' ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. నవంబర్ 20న ఈ సినిమా తెలుగు, మలయాళం, హిందీ, తమిళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్‌తో ఆసక్తిని పెంచిన ఈ సినిమా.. ట్రైలర్‌తో ప్రేక్షకుల్లో మరింత అంచనాలను పెంచుతోంది. ఈ చిత్రంలో సాత్విక వీరవల్లి ..కల్పన అనే గ్రామీణ యువతి పాత్రలో కనిపించనుంది. చిన్న గ్రామంలో జీవించే కల్పనకు వ్యోమగామి కావాలనే పెద్ద కల ఉంటుంది. తన పరిస్థితులు, ఎదురయ్యే అడ్డంకులు ఎన్ని ఉన్నా ఆ లక్ష్యాన్ని సాధించాలని ఆమె పట్టుదలగా ప్రయత్నిస్తుంది. ఈ ప్రయాణంలో కృష్ణ అనే పాత్రలో నటించిన దుల్కర్ సల్మాన్ ఆమెకు అండగా నిలుస్తాడు. కల్పన కలను నిజం చేయడానికి కృష్ణ ఎలా తోడ్పడ్డాడు? ఆమె ఎదుర్కొన్న సవాళ్లను అధిగమించేందుకు ఎలా సహాయం చేశాడు? అనే అంశాల చుట్టూ ఈ కథ సాగనుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాల ద్వారా సినిమా కథలోని ప్రధాన అంశాలు ప్రేక్షకులకు కొంతవరకు పరిచయమయ్యాయి. తాజాగా వచ్చిన ట్రైలర్ మాత్రం కథలోని భావోద్వేగాలను మరింత బలంగా చూపించింది. ముఖ్యంగా ఓ సాధారణ గ్రామీణ అమ్మాయి అంతరిక్షంలోకి వెళ్లాలనే అసాధారణమైన కలను సాకారం చేసుకోవడానికి చేసే ప్రయత్నాలు ఆకట్టుకుంటున్నాయి. ఆమెకు అండగా నిలిచే కృష్ణ పాత్ర సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ట్రైలర్‌ను ఆసక్తికరంగా కట్ చేశారు. హృదయాన్ని తాకే సంభాషణలు, మనసుకు హత్తుకునే నేపథ్య సంగీతం కథకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. కల్పన కల, ఆమె ప్రయాణంలో ఎదురయ్యే కష్టాలు, కృష్ణ ఇచ్చే ధైర్యం.. ఇలా ప్రతి అంశాన్ని భావోద్వేగభరితంగా చూపించారు. ట్రైలర్ చూస్తుంటే వెండితెరపై ఈ కథను చూడాలనే ఆసక్తి కలుగుతోంది. ఈ సినిమాలో దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లితో పాటు శ్రుతి హాసన్, స్వాసిక, మురళీ శర్మ, రుహానీ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నటీనటుల ప్రదర్శనలు కూడా సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా కనిపిస్తున్నాయి. నిర్మాణ విలువలు రిచ్‌గా ఉండటంతో పాటు, కథకు తగ్గట్టుగా విజువల్స్‌ను రూపొందించినట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. 'ఆకాశంలో ఓ తార' చిత్రానికి పవన్ సాదినేని దర్శకత్వం వహిస్తున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్‌బాక్స్ మీడియా, వైజయంతీ మూవీస్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమా నవంబర్ 20న తెలుగు, మలయాళం, హిందీ, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఇంట్లో దెయ్యం ఉందని భయపడిన శృతి హాసన్..

కదిలే బొమ్మతో వణికిపోయా అంటూ షాకింగ్ కామెంట్స్!



దెయ్యాలు, ఆత్మలు, అతీంద్రియ శక్తులు ఉన్నాయా? లేవా? అనే ప్రశ్నకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేదు. పారానార్మల్ యాక్టివిటీస్ గురించి ప్రపంచవ్యాప్తంగా ఎన్నో కథలు, అనుభవాలు ప్రచారంలో ఉన్నాయి. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు కొందరు తమ జీవితాల్లో ఎదురైన వింత సంఘటనలను పలు సందర్భాల్లో వెల్లడించారు. తాజాగా ఈ జాబితాలో స్టార్ హీరోయిన్ శృతి హాసన్ కూడా చేరారు. తన ఇంట్లో ఓ బొమ్మ కారణంగా ఎదురైన భయానక అనుభవాన్ని ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఆ బొమ్మ తనకు నిద్రలేని రాత్రులను మిగిల్చిందని, చివరకు దాన్ని ఇంటి నుంచి బయటకు పంపించాల్సి వచ్చిందని వెల్లడించారు. ప్రస్తుతం ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తనకు ఎదురైన వింత అనుభవం గురించి శృతి హాసన్ మాట్లాడుతూ.. చెన్నైలోని తన ఇంట్లో కొన్ని సందర్భాల్లో ఏవో అదృశ్య శక్తులు ఉన్నట్లు అనిపించేదని చెప్పారు. అయితే ప్రతిసారీ ఇలాంటి అనుభవాలు ఎదురుకాలేదని, కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే వింత సంఘటనలు జరిగేవని వెల్లడించారు.తన దగ్గర మనిషి పరిమాణంలో ఉండే ఓ బొమ్మ ఉండేదని, దానికి ఫియోనా అని పేరు పెట్టుకున్నానని తెలిపారు. తన స్నేహితులు ఇంటికి వచ్చినప్పుడు కూడా ఆ బొమ్మను పలకరించేవారని చెప్పారు. అంతేకాకుండా ఆ బొమ్మను అల్మారాలో పెట్టి దానిపై రకరకాల బొమ్మలు గీస్తూ ఉండేవారట. మొదట్లో అదొక సాధారణ బొమ్మగానే భావించినప్పటికీ, ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనలు తనను తీవ్రంగా భయపెట్టాయని శ్రుతి వివరించారు. ఆ బొమ్మ విషయంలో తనకు ఎదురైన అత్యంత భయానక అనుభవాన్ని కూడా శ్రుతి హాసన్ వెల్లడించారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS, peerzadi guda, GHMC, medchal malkaj giri AND PUBLICATIONS, , Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONSContact No : 9440032006. MAIL ID : prajavaani006@gmail.comepaper.prajavaani.net